తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 09.06.2026 | సంపుటి :12 సంచిక : 320 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణకు

మోదీ ఏం చేశారో.. నేనేం చేశానో..

చర్చకు సిద్ధం

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటూ గుజరాత్‌కు గులాంగిరి

మెట్రో, మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారు? కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లపై మండిపడ్డ సీఎం రేవంత్ రెడ్డి

- ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయాలు మాట్లాడుకుందాం
- ఈ రెండేళ్లు కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం
- మహా నగరంలో పేదలకు లక్ష ఇళ్లు
- ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారు
- సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ నుంచి 8 మంది భాజపా ఎంపీలను పంపిస్తే మోదీ ప్రధాని అయ్యారు. మరి ఆ ఎంపీలు తెలంగాణకు ఏం తీసుకొచ్చారు. రెండేళ్లలో ఏం చేయలేదని నన్ను అంటున్నారు.. మరి మీరేం చేశారు? నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుపుల్ల పెట్టారు. సబర్మతి, గంగా, యమున నదులను ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అన్నారు. మూసీ ప్రక్షాళనకు సహ కరించమని భాజపా ఎంపీలు మోదీని అడిగారా? పదేళ్ల కేసీఆర్ పాలన, పన్నెండేళ్ల మోదీ పాలన, 30 నెలల మా పాలనపై చర్చకు సిద్ధం. మిగతా 2లో..

"దేశంలోని ప్రధాన నగరాలైన దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయి. ఈ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కాలుష్యం వల్ల దిల్లీలో స్కూళ్లు, ప్రధాని కార్యాలయాన్నే మూసేశారు. మన హైదరాబాద్ నివాసానికి అనుకూలంగా ఉంది. పెద్ద నగరాలకు ఉన్న సమస్యలు హైదరాబాద్‌లో లేకుండా చూసేందుకు నిపుణులతో కమిటీ వేశాం. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో భవిష్యత్తు తరాలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సీఎం వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవం

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారు : రామచందర్‌రావు

2లో..

మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు

నేడు ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో అందజేత

బతుకులు బుగ్గి

- విశాఖ స్టీల్‌లో భారీ ప్రమాదం
- లిక్విడ్ లాడిల్ పేలి లీకైన ఉక్కుద్రవం

మంటలు చెలరేగి 9 మంది కార్మికుల దుర్మరణం

స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో లీకైన ఉక్కుద్రవం

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశం

- ఏడుగురికి తీవ్ర గాయాలు..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఘటనపై ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

విశాఖపట్నం(జనంసాక్షి):విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిపమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలాయి. ల్యాడల్‌లో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ప్రమాదస్థలిలో 9 మంది కార్మికులు మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ యాజమాన్యం అత్యవసర భద్రతా చర్యలు చేపట్టింది. గాయపడిన కార్మికులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ప్లాంట్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడల్‌లోని ద్రవ లోహం ఎందుకు కిందపడింది?, సాంకేతిక లోపమా? లేక భద్రతా ప్రమాణాల్లో ఏవైనా నిర్లక్ష్యం జరిగిందా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అధికారిక నివేదిక వచ్చిన తర్వాతే గాయపడిన వారి సంఖ్య, మరణాల వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర మిగతా 2లో..

భూ కబ్జాదారుల గుండెల్లో భయం పుట్టిస్తుంటే

ఓర్వలేకపోతున్నారు

- హైడ్రా చట్టపరిధిలోనే పనిచేస్తోంది
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల్ని సరిచేస్తుంటే.. మాపై నిందలా? :మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్(జనంసాక్షి):
బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేస్తుంటే తమపై నిందలు వేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. నాజీ సిద్ధాంతాలకు సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు ఇస్తున్నారని కొందరు ప్రచారం చేయడంపై మండిపడ్డారు. హిట్లర్ సిద్ధాంతాలను పాటిస్తామని సీఎం చెప్పలేదని స్పష్టం చేశారు. ఏదైనా పని సాధించే వరకు విరమించని వాడినే హిట్లర్ అంటారని, ఏ పనినైనా పట్టుదలతో సాధించాలని సీఎం చెప్పారని అన్నారు. హైడ్రాపై వస్తున్న ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. భూ కబ్జాదారుల గుండెల్లో భయం పుట్టిస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారు. హైడ్రా చట్టపరిధిలోనే పనిచేస్తోందన్నారు. రాజ్యాంగం, చట్టం ప్రకారమే నోటీసులు ఇస్తుందని చెప్పారు. హైడ్రా చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని, బీఆర్ఎస్ నేతలకే ఇబ్బంది కలుగుతున్నట్లు ఉందని అన్నారు. మిగతా 2లో..

రూ.లక్ష కోట్లకుపైగా విలువైన

భూములను రక్షించాం

వచ్చే ఏడాదికి రూ. 2లక్షల కోట్లు అధిగమిస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్

2లో..

ఎబోలా లక్షణాలు ఉంటే సమాచారం ఇవ్వండి

- విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా
- వ్యాధి వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం
- అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర

హైదరాబాద్(జనంసాక్షి):
కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జన్సీ రెస్పాన్స్ సిస్టమ్, తదితర అంశాలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్ర యాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి, గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితులను టెస్టుల కోసం పూణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. మిగతా 3లో..

దేశానికి ఆదర్శంగా యూరియా యాప్

అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి: మంత్రి తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి):
రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపటాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వా రా కూడా ఎరువుల మిగతా 2లో..

రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం

డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు

2లో..

పెళ్లికి ముందు శారీరక సంబంధాలు మోసపూరితమని చెప్పలేం

పరస్పర అంగీకారంతోనే జరిగినట్లు గుర్తించాల్సిందే

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

2లో..

బెంగాల్‌లో నిట్టనిలువునా చీలిన తృణముల్

- మమతకు వరుస షాక్‌లు..
- ఎన్డీయేకు 20మంది లోక్‌సభ టీఎంసీ ఎంపీల మద్దతు
- రాజ్యసభ సభ్యత్వానికి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా

కలిసికట్టుగా ఉంటేనే నిలబడతాం

బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుదాం • కూటమి పార్టీలకు రాహుల్ పిలుపు

న్యూఢిల్లీ,జూన్8(జనంసాక్షి):
కలిసికట్టుగా ఉంటేనే నిలబడతామని, విడిపోతే పడిపోతామని లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషయాన్ని భాగస్వామ్య పార్టీలు గుర్తెరిగి, ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూట్ క్లబ్‌లో సోమవారంనాడు జరిగిన 'ఇండియా' కూటమి సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. కూటమి పార్టీలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలని అనుకోకుండా కలిసి కట్టుగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని, బీజేపీ నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. 'ఓటు చోరీ' వంటి పలు అంశాల విషయంలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం లోపించడం, కూటమిలో భాగస్వామ్యం కలిగిన కొన్ని పార్టీలు మిగతా 2లో..

'సర్'తో లక్షలాది ఓట్లు గల్లంతు

ప్రధాని మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

ఇండియాకూటమి భేటీలో ఖర్గే

న్యూఢిల్లీ,జూన్8(జనంసాక్షి):
ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ మిగతా 2లో..

బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్

- మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- క్రిటికల్ మినరల్స్ కోసం అర్జెంటీనాతో ఒప్పందం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):
క్రమంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, మిగతా 2లో..

ఎడతెగని దాడులు

ట్రంప్ వద్దన్నా.. ఆగని ఇజ్రాయెల్.. తగ్గని ఇరాన్ • ఒకరిపై ఒకరు పరస్పరదాడులు



టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య ఏప్రిల్ 8 తర్వాత మరోసారి తీవ్రస్థాయి ఘర్షణలు మొదలయ్యాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇరాన్ ప్రతిదాడులు మొదలుపెట్టింది. దాదాపు 10 క్షిపణులు ఉత్తర ఇజ్రాయెల్ వైపు దూసుకొచ్చినట్లు ఐడీఎఫ్ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఇరాక్‌లోని కొన్నిచోట్ల కూడా దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. మరోవైపు ఇరాన్ దాడులకు స్పందించవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలుస్తోంది. శాంతి ఒప్పందానికి తాము చాలా దగ్గరగా ఉన్నామని ట్రంప్ గుర్తుచేశారు. "ఇప్పటికే మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చర్చలకు రండి" అని ఇరాన్‌కు సూచించారు. మరోవైపు నెతన్యాహుని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ "వారి దాడిలో ఎవరికీ ఏమీ కాలేదు. ఇజ్రాయెల్ ప్రతిదాడి చేయదని మిగతా 2లో..

దాడులు నిలిపివేస్తాం

కానీ లెబనాన్‌పై మళ్లీ దాడి చేస్తే ఊరుకోం : ఇరాన్

హర్మూజ్‌వద్ద భారతీయులున్న నౌకపై దాడి..

తక్షణమే ఇరాన్‌ను వీడండి

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఎంబసీ అడ్వైజరీ జారీ

దేశంలో సరిపడా ఇంధన నిల్వలు

హర్మూజ్ 3 నెల మూతపడినా ఢోకా లేదు: హర్‌దీప్ సింగ్

వివరాలు 2వ పేజీలో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
09.06.2026

బెంగాల్‌లో నిట్టనిలువునా చీలిన తృణముల్

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్ర సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో లోక్‌సభలోని 20మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎంపీ కకోలీ ఘోష్ నేతృత్వంలో రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించారు. లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా తాను.. తోటి ఎంపీలతో సంప్రదింపుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఘోష్ తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. వారు ఎన్నుకున్న ప్రభుత్వంతోనే కలిసి పని చేయాలని తమ బృందం నిర్ణయించుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ అంశంపై టీఎంసీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ చీలికతో లోక్‌సభలో మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్‌కు కేవలం ఎనిమిదిమంది సభ్యులే మిగిలారు. బెంగాల్ శాసనసభలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయారు. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 58 మందికి పైగా తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం తామే నిజమైన తృణమూల్ వర్గం అని ప్రకటించుకుంది. టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ అయిన సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

పెళ్లికి ముందు శారీరక సంబంధాలు మోసపూరితమని చెప్పలేం

న్యూఢిల్లీ(జనంసాక్షి): పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పెళ్లికి ముందు పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వం లేదా నడవడికను ప్రశ్నించలేమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రేమ సంబంధాలు అన్నీ వివాహానికి దారితీయవని తెలిపింది. ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రేమ బంధం తర్వాత వివాహంగా మారకపోయినా, దానిని మోసం లేదా నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అలాగే, ప్రేమలో ఉన్న సమయంలో వివాహం చేసుకుంటామని భావించి శారీరక సంబంధం ఏర్పడినప్పటికీ, తర్వాత వివిధ కారణాల వల్ల పెళ్లి జరగకపోతే ప్రతి సందర్భంలోనూ అది మోసం చేసినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

హైదరాబాద్(జనంసాక్షి):మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు కేటాయించనుంది. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ బస్సులను మహిళా సంఘాలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, భద్రత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తోంది. రాష్ట్ర మహిళా సాధికారత నమూనాను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు హాజరు కానున్నారు. అందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకాన్ని దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సిఎస్ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూత నిస్తున్నదని అన్నారు. మహిళల కోసం తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు కోసం ఆయా రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వస్తున్నారని సిఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ లు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, రవాణా కమిషనర్ ఇలంబర్తి, సీఈఓ దివ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్

సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ.1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం అన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొన్నేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు.

తెలంగాణకు మోదీ ఏంచేశారో.. నేనేం చేశానో.. చర్చకు సిద్ధం

ఎవరేం చేశారో.. ఎన్ని నిధులు తెచ్చారో చర్చిద్దాం రండి.రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.రూ.229 కోట్లతో ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ.29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ.26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికీ భూమిపూజ చేశారు.

ఇప్పటివరకు రూ.లక్ష కోట్లకుపైగా విలువైన భూములను రక్షించాం

హైదరాబాద్(జనంసాక్షి): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా కీలక మైలురాయిని అధిగమించింది. అక్రమార్కుల చెర నుంచి గడిచిన రెండేళ్లలో రూ. లక్ష కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ స్థలాలు, చెరువుల భూములు, నాలాలను రక్షించి ప్రభుత్వానికి అప్పగించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వచ్చే ఏడాదికి రూ. 2లక్షల కోట్లు అధిగమిస్తుందని తెలిపారు. భూ మాఫియాను అడ్డుకోవాలంటే ప్రజలు, మీడియా భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు.రెండేళ్లలో నగర ప్రజల ప్రోత్సాహంతో రూ. లక్షా 10 వేల కోట్ల విలువైన భూములను కబ్జాదారుల నుంచి విడిపించినట్లు రంగనాథ్ చెప్పారు. నగరంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను క్లెయిమ్ చేయడం, వాటిని సంరక్షించడం, పునరుద్ధరించడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తుందని వివరించారు. ఇటీవల కోకాపేట, పుప్పాలగూడ, నార్సింగిలో హైడ్రా సిబ్బంది రూ. వేలాది కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను రక్షించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలుగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.

రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం

డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. హౌసింగ్ బోర్డు భూముల పరిశీలన సమయంలో రాము నాయిక్ చేసిన భారీ అక్రమాలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్‌లో గజం రూ.2 లక్షలకు పైగా విలువ చేసే హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయిక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు తేల్చారు. ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలనలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ భూములను కాజేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ దందాలకు పాల్పడిన అధికారులపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాము నాయిక్‌పై 2016 నుంచే వివిధ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగర్ కాలనీ భూ వ్యవహారాలు, తుల్జాగూడ, లక్ష్మీగూడ, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లోని భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై అధికారులు విచారణను ముమ్మరం చేశారు. సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోంది. అక్రమ సేల్ డీడ్‌లను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూ దందాలకు సహకరించిన ఓ సూపరింటెండెంట్‌ను రెవెన్యూ శాఖ డిస్మిస్ చేసింది. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. భూకబ్జాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టగా.. తీగ లాగితే డొంక కదిలినట్లు భూ దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

బతుకులు బుగ్గి

దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుల మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈ ప్రమాదంపై వెంటనే స్పందించారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

దేశానికే ఆదర్శంగా 'యూరియా యాప్'

బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ల÷తుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు.

సీఎం వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవం

హైదరాబాద్(జనంసాక్షి):రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మరిచిపోయి అబద్ధాలు చెబుతున్నారని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అసలు సమయం అడిగారా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని దేవేంద్ర ఫడణవీస్ ఆఫీసు చెప్పిందన్నారు."నెల క్రితం మంత్రి ఉత్తమ్ కలుస్తామని టైం కోరారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి టైం అడగకుండానే కలవకుండా చేస్తున్నారని అబద్ధాలు చెబుతున్నారు. భారత్ పురోగమిస్తోందని ప్రపంచ దేశాలు అంటుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుంది. అందుకే, ఉత్తర, దక్షిణ భారతదేశం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు.

ఉజ్వల లబ్ధిదారులకు రాయితీ సిలిండర్లలో కోత

న్యూఢిల్లీ(జనంసాక్షి):
ఉజ్వల పథకం కింద ఇస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం కుదించింది. ఏడాదికి నాలుగు సిలిండర్లకే పరిమితం చేసింది. పేదలకు ఉచితంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు ఇచ్చే ఉద్దేశంతో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని 2016లో తీసుకొచ్చారు. ఈ పథకంలో భాగంగా తొలుత ఏడాదికి 12 గ్యాస్ సిలిండర్లను సబ్సిడీపై అందించేవారు. గతేడాది ఈ సంఖ్యను 9కి తగ్గించారు. తాజాగా దాన్ని నాలుగుకు పరిమితం చేశారు.కుటుంబ సగటు వినియోగానికి అనుగుణంగా ఈ మార్పు చేసినట్లు పెట్రోలియం శాఖ అదనపు శాఖ కార్యదర్శి ప్రవీణ్ మల్ ఖనూజ్ వెల్లడించారు. గతంలో ఏడాదికి 12 సిలిండర్ల వరకు ఒక్కో సిలిండర్‌కు రూ.200 చొప్పున బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసేదన్నారు. 2023లో సబ్సిడీ మొత్తాన్ని రూ.300కు పెంచామని చెప్పారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలోనే ఎల్‌పీజీ సిలిండర్ ధర తక్కువని ప్రవీణ్ తెలిపారు. ఆయిల్ కంపెనీలు ఒక్కో సిలిండర్‌కు రూ.700 చొప్పున భారాన్ని భరిస్తున్నాయని పేర్కొన్నారు.దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఎల్‌పీజీ ధరలూ పెరుగుతున్నాయి.

కలిసికట్టుగా ఉంటేనే నిలబడతాం

సైతం కాంగ్రెస్‌పై తరచు విమర్శలు చేస్తుండటంపై రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసారు. గత లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని, అయితే అంతర్గత కుమ్ములాటతోనే మనకు మనం బలహీనమవుతున్నాయనే విషయాన్ని విపక్షాలు గుర్తించాలని సూచించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు సాధించినప్పటికీ ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైంది. 2019లో 52 సీట్లు మాత్రమే సాధించిన కాంగ్రెస్ పార్టీ అనంతరం జరిగిన 2024 ఎన్నికల్లో 99 స్థానాలు గెలుచుకుంది. ఇటీవల లోక్‌సభలో విపక్షాలన్నీ ఏకతాటిపై నిలబడటంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విజన బిల్లు వీగిపోయింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జరిగిన సుమారు నెలరోజుల్లోనే 'ఇండియా' కూటమి తాజాగా ఢిల్లీలో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో అస్సాం, బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించగా, కేరళలో కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాడులో టీవీకే విజయ్ విజేతగా నిలిచారు. పూర్తి మెజారిటీ రాకపోవడంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల మద్దతుతో అధికారం చేపట్టారు. కాగా, మూడేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ఏర్పడిన 'ఇండియా' కూటమి ఇకనుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని న్యూఢిల్లీ సమావేశంలో నిర్ణయించారు. తదుపరి సమావేశం వచ్చే ఆగస్టులో హైదరాబాద్‌లో జరుపుతామని ఖర్గే ప్రకటించారు.

'సర్'తో లక్షలాది ఓట్లు గల్లంతు

వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

ఎడతెగని దాడులు

ఆశిస్తున్నా... ఒకవేళ బీబీ ఎదురుదాడి చేస్తే గత 47 ఏళ్ల నుంచి జరుగుతున్నదే కొనసాగుతుంది" అని పేర్కొన్నారు. మరోవైపు ట్రంప్ ఎంత వారిస్తున్నా.. ఇజ్రాయెల్ ఆయన మాటను లెక్కచేయలేదు. సోమవారం ఉదయం ఇరాన్ లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు మొదలుపెట్టాయి. పశ్చిమ, మధ్య ఇరాన్‌లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఎయిర్‌ఫోర్స్ భారీ దాడులు చేపట్టాయి. టెహ్రాన్‌లో పలుచోట్ల భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతోపాటు తబ్రిజ్, ఇస్ఫహాన్ తదితర నగరాలు కూడా పేలుళ్లతో దద్దరిల్లాయి. ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టడంతో ఇరాన్ గగనతలం మూసివేసింది. మరోవైపు ఖతార్, సిరియాలు ఇప్పటికే ఇరాన్ దాడుల కారణంగా గగనతలాలను మూసివేశాయి. ఇజ్రాయెల్ ఎయిర్ లాంచ్ బాలిస్టిక్ క్షిపణులను వాడినట్లు ఇరాన్ ఆరోపించింది.

దాడులు నిలిపివేస్తాం

కానీ లెబనాన్‌పై మళ్లీ దాడి చేస్తే ఊరుకోం : ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):ఇజ్రాయెల్‌పై దాడులను నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఒకవేళ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తే.. తాము మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరుదేశాలు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని.. శాంతి, సుస్థిరతను నెలకొల్పాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఐఆర్‌జీసీ ఈ ప్రకటన చేసింది. సోమవారం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ ప్రయోగించిన పలు డ్రోన్‌లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చేశాయని వెల్లడించింది.
దేశ రక్షణ కోసం ఎటువంటి ముప్పును అయినా ఎదుర్కొంటామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. దౌత్యం, రక్షణ అనేవి జాతీయ శక్తికి రెండు రెక్కల వంటివని అన్నారు. యుద్ధరంగం నుండి గానీ.. చర్చల నుంచి కానీ తాము వైదొలగలేదని వెల్లడించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. చాలా అనుమానాల మధ్య తమ అధికారులు అమెరికాతో శాంతి చర్చలు జరుపుతున్నారని.. లెబనాన్‌లో ఇజ్రాయెల్ అగ్రరాజ్యానికి తెలిసి జరిగినా తెలియకుండా జరిగినా వాటి వల్ల చర్చల ప్రక్రియకు అంతరాయం కలుగుతుందన్నారు. శాంతి ఒప్పందానికి దగ్గరగా ఉన్న సమయంలో ఈ దాడులు చేపట్టడం సరైన చర్య కాదన్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేపట్టే ఏ చర్యకైనా అమెరికానే ప్రత్యక్ష బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

హర్మూజ్‌వద్ద భారతీయులున్న నౌకపై దాడి..

న్యూఢిల్లీ(జనంసాక్షి):అంతర్జాతీయ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి ఇలాంటి సమయంలో జలసంధికి సమీపంలో ఒమన్ తీరంలో ఒక సరకు రవాణా నౌకపై డ్రోన్ లేక క్షిపణితో దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.పర్షియన్ గల్ఫ్‌లో పలావు దేశ జెండాతో వెళ్తోన్న నౌక ఒమన్ తీరానికి దగ్గర్లో ఉన్నప్పుడు దాడి జరిగిందని ప్రాథమికంగా తెలుస్తోంది. అప్పుడు నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. ఆ దాడితో ఇంజిన్ దెబ్బతిన్నదని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్ఓఎస్ కాల్ పంపినట్లు కనిపిస్తోంది. ఆ ఓడలో పలువురు గాయపడ్డారని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఇండియా వెల్లడించింది. దాడిలో లైఫ్ బోట్లు కూడా దెబ్బతినడంతో తరలింపు ప్రక్రియ కూడా సంక్లిష్టమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

తక్షణమే ఇరాన్‌ను వీడండి

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఎంబసీ అడ్వైజరీ జారీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది.పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

దేశంలో సరిపడా ఇంధన నిల్వలు

హర్మూజ్ మరో నెల మూతపడినా ధోకా లేదు: హర్‌దీప్ సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలో ఇంధన నిల్వలకు ధోకా లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మరోనెల రోజుల పాటు మూతపడి ఇంధన సరఫరాకు అవరోధం ఏర్పడినా 30 నుంచి 60 రోజుల పాటు ఆ షాక్‌ను భారత్ తట్టుకోగలదని, ఆ మేర ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. సీఎన్ఎన్-న్యూస్ 18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు ఆయన మాట్లాడారు.వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, రిఫైనరీ ఇన్వెంటరీలు, కమర్షియల్ స్టాక్స్‌తో కలిపి దేశంలో ప్రస్తుతం 76-80 రోజులకు సరిపోయే ఇంధన నిల్వలు ఉన్నాయని పురి అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడినా, భారతదేశం సులువుగా తట్టుకోగలదని పేర్కొన్నారు. గల్ఫ్ వెలుపల ఉన్న ఇతర చమురు ఉత్పాదక దేశాల నుంచి సరఫరాను పెంచడం, అలాగే మొజాంబిక్ నుంచి అదనపు గ్యాస్ సరఫరాను అందుకోవడం ద్వారా భారత్ తన ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసుకుంటోందని హర్‌దీప్ సింగ్ పురి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో అదనపు ఎల్‌పీజీ కార్గోలను సరఫరా చేయడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి కీలక భాగస్వామ్య దేశాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఎక్కువ కాలం పాటు గరిష్ఠ స్థాయిలో కొనసాగే అవకాశం లేదని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ మార్కెట్లో అస్థిరత ఉన్న సమయంలో దేశీయంగా రిఫైనింగ్ సామర్థ్యాన్ని భారత్ నిరంతరం విస్తరిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 24 రిఫైనరీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం

- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం వెల్లడి

హైదరాబాద్, జూన్8 (జనంసాక్షి) : ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చెక్ పెడతామన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడులు తగ్గించడమంటే ప్రజలకు విద్య రద్దు చేయడమే..

- ఈ దుర్మార్గంపై తెలంగాణ సమాజం పోరాటాలు చేయాలి
- పాలమూరు అధ్యయన వేదిక

హైదరాబాద్ (జనంసాక్షి) : బడులు తగ్గించడమంటే ప్రజలకు విద్య రద్దు చేయడమేనని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ వి.రాఘవాచారి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక అసాధారణ మైన సమావేశంలో హిందూ పత్రిక ఎన్. రామ్ తో సంభాషణ లో తన నిజ స్వరూపం బయట పెట్టుకున్నాడు. తాను స్వయంగా నల్లమల బిడ్డను అని, వెనుక బడిన మహబూబ్ నగర్ గడ్డ నించి వచ్చిన అని అనేక పర్యాయాలు ప్రకటించు కున్న వ్యక్తి విద్య పట్ల, విద్యా రంగ భవిష్యత్తు పట్ల బాధ్యత లేకుండా మాట్లాడటం చాలా అన్యాయమన్నారు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్ తన ప్రాధాన్యత అని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ ప్రకటన తో విద్య పట్ల తన వ్యతిరేక విధానాలను ప్రకటించారని, ఇపుడు గ్రామాల్లో ఉన్న బడులు ఒక రోజు ఏర్పడినవి కాదని, ఒకరు ఏర్పాటు చేసినవీ కాదని, అవి ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమ కష్టం, కష్టార్జితం, ఎంతో సమయం ఇచ్చి ఏర్పాటు చేసినవని, ఇపుడు ఆ తరం వెళ్లి పోయిందని, వారి ముందు చూపు వల్ల రాష్ట్రంలో ఇంత సంఖ్యలో బడులు ఉన్నాయని, అలాంటి పాఠశాలలు మూసి వేస్తామని చెప్పడం గొప్ప విషయం కాదని, పాఠశాలల సంఖ్యను గణనీయంగా తగ్గించి నాలుగు వేల కు కుదించు తామని ప్రకటించారని, దీనిని తీవ్రంగా ఖండించక పోతే, ఆపడానికి పోరాటాలు చేయకపోతే భవిష్యత్తు లో ప్రభుత్వ పాఠశాలలు ఉండవని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం తో పోటీ పడి నూతన ఆర్థిక విధానాలను, విద్యా విధానాన్ని ఎన్ జీ ఓ ల ఆధ్వర్యంలో అమలు చేయాలని చూస్తున్నారని తెలిపారు. బడి ని ఆర్థిక కోణం లో చూసి, లాభం నష్టం పేరుతో మూసి వేస్తామని అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చాలా పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

పెంచిన పెట్రో ధరలకు నిరసన

- 10న జిల్లా కలెక్టరేట్ ముందు సిపిఐ ధర్నా

నల్లగొండ, జూన్8 (జనంసాక్షి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి సమావేశం కామ్రేడ్ డి.లింగా నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా బంటు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 10వ తేదీన నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు ఇప్పటికీ ఆరుసార్లు పెంచడంతో సామాన్య ప్రజలకు గుదిబండగా మారిందన్నారు. రైతు కొనే అడుగు పిండి బస్తాకు రూ.300 నుండి 400 పెంచడం వల్ల, యూరియా ఆన్‌లైన్ యాప్ ద్వారా బుకింగ్ చేయాలంటే 60 శాతం రైతులకు ఆ యాప్ గురించి అవగాహన లేకపోవడంతో రైతులు యూరియా గురించి అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ యాప్ ని రద్దుచేసి రైతులకు అధికారుల ద్వారా నేరుగా యూరియా అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి డి.శాంత, మండల సమితి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి భూసేకరణ ప్రక్రియకు అవసరమైన చర్యలు

- ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రామ్మోహన్ రెడ్డి
- రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్‌తో భేటీ

హైదరాబాద్ (జనంసాక్షి) : కొందుర్గు - పరిగి -లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డితో కలిసి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్‌ను సచివాలయంలో కలిసి ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. భూసేకరణ ప్రక్రియకు అవసరమైన ఆర్థిక అనుమతులను త్వరగా మంజూరు చేసి, రంగారెడ్డి మరియు వికారాబాద్ జిల్లాల కలెక్టర్ల ద్వారా భూసేకరణ నోటిఫికేషన్ జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ అత్యంత కీలకమని, రైతులు మరియు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సాగు, తాగునీటి అవసరాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యేలు, పెండింగ్‌లో ఉన్న పరిపాలనా మరియు ఆర్థిక అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎబోలాపై అప్రమత్తంగా ఉన్నాం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎబోలాపై అప్రమత్తంగా ఉన్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జన్సీ రెస్పాన్స్ సిస్టమ్, తదితర అంశాలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు.ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి, గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి, వారి సాంపిల్స్‌ను టెస్టుల కోసం పూణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. ఐసీఎంఆర్ సూచన మేరకు వారి సాంపిల్స్‌ను మరోసారి సేకరించి టెస్టుల కోసం పూణేలోని ఎన్ఐవీకి పంపించామని చెప్పారు. రెండోసారి నెగిటివ్ వస్తే, వారిని ఐసోలేషన్‌లో నుండి డిశ్చార్జ్ చేస్తామన్నారు. అనుమానిత సాంపిల్స్ సేకరణ, టెస్టులు చేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ డైరెక్టర్‌ను మంత్రి కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టులు చేయడం ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్, డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. సాంపిల్ వచ్చిన వెంటనే టెస్టులు చేసి, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తామని ఆయన వివరించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండడం లేదని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ అంశంపై మంత్రి సీరియస్‌గా స్పందించారు. ఎబోల ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. తప్పుడు వివరాలు అందించడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. తప్పు సమాచారం ఇచ్చే వారిపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పుడు సమాచారం అందించినట్లయితే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే విషయాన్ని శంషాబాద్ విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని మూడు షిఫ్టుల్లో, 24 గంటలపాటు విమానాశ్రయంలో అందుబాటులో ఉంచి పర్యవేక్షణ, సమాచార సేకరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎబోలా వ్యాధి నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సంతోష్ చౌహాన్, కేంద్ర ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పావని, జీఎంఆర్ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సంజయ్ కుమార్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారి, ఐడీఎస్‌పీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజీ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి డీసీపీ శిల్పవల్లి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు రాకేశ్ రంజన్, అన్న మేరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్టా ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం (ఎక్టా) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు 7 జూన్ 2026 ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి 11 గంటల వరకు అజ్మాన్ లోని హ్యాబిటెట్ స్కూల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 250 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు అయిన తెలంగాణ అస్తిత్వ వేదిక చైర్మన్, తెలంగాణ ఉద్యమ నాయకులు వి.ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముందుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కిరణ్ కుమార్ పీచర మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకొన్నసందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుక అంటే కేవలం ఒక రోజును పండుగ చేసుకోవడం కాదని తెలంగాణ చారిత్రక వైభవం, దశాబ్దాల పోరాటం, వేలాది మంది త్యాగాలు, కోట్లాది ప్రజల ఆకాంక్షలు ఫలించిన చారిత్రాత్మక రోజును స్మరించుకుంటున్న గొప్ప రోజని అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ సమాజానికి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. తెలంగాణ జేఏసీకి నాయకత్వం వహించిన జేఏసీ చైర్మన్ కోదండరాం, ఉద్యమానికి ఉత్తేజాన్ని నింపిన ప్రజా నౌక గద్దర్, తెలంగాణ రాష్ట్రీయ గీతాన్ని అందించిన అందెశ్రీని, గోరేటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, నందిని సిద్ధారెడ్డి కృషిని కొనియాడారు. ముఖ్య అతిథి వి.ప్రకాష్ మాట్లాడుతూ అవతరణ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం మన తెలంగాణ ఉద్యమాన్ని, చరిత్రను, త్యాగాలను గౌరవించుకోవడం అని, తెలంగాణలో కంటే వివిధ దేశాల్లో సంఘాలు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గొప్పగా నిర్వహిస్తున్నారని వాటి వాళ్ళ మన పిల్లలకు ఉద్యమ చరిత్ర, సాంస్కృతిక వైభవం గురించి తెలుస్తుందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నో అంశాల్లో అభివృద్ధి చెందిందని పలు ఉదాహారణలతో చక్కగా విశ్లేషించి చెప్పారు. కార్యక్రమంలో చిన్నారులచే తెలంగాణ ప్రముఖుల వేషధారణ, నృత్యాలు, మహిళా విభాగ సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద్ విపుల దంపుతుల స్కిట్, గాయకుడు మల్లేష్ కోరేపు పాడిన పాట అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో జుజూా ఫౌండర్ కిరణ్ కుమార్ పీచర, మాజీ అధ్యక్షుడు రాధారపు సత్యం, ఎక్టా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అలిగేటి, జాయింట్ సెక్రటరీ శేఖర్ గౌడ్, కోశాధికారి తిరుమల్ రావు, కల్చరల్ సెక్రటరీ వినోద్ కుమార్ సభ్యులు సాయి చందర్, వెంకటేశ్వర్ రావు, మధుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, సంతోష్ కుమార్, రాము జల, రాము కందుకూరి, రఘు అలిగేటి, రమణ స్వర్గం, సారిక, మౌనిక, వివిధ తెలంగాణ, తెలుగు సంఘాల అధ్యక్షులు రాజ శ్రీనివాస్ రావు, మస్సియోద్దీన్, గుండెల్లి నర్సింహా, రవి కటుకం, ఎస్వీఎస్ రెడ్డి, లెమన్ స్టూడియో రమేష్, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం వెయ్యి కిలోమీటర్లు

- రికార్డు సాధించిన గోలేటి యువకుడు

రెబ్బెన, జూన్ 08 (జనం సాక్షి): సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలనే లక్ష్యంతో చేపట్టిన 1000 కిలోమీటర్ల సైకిల్ యాత్ర గోలేటి గ్రామానికి చెందిన ఓరగంటి రంజిత్ కుమార్‌కు అరుదైన గుర్తింపును తీసుకొచ్చింది. ఆయనకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి-విశాఖపట్నం మధ్య 17 రోజుల పాటు సాగిన ఈ చైతన్య యాత్రలో రంజిత్ కుమార్ 30కి పైగా విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. విజయవాడలోని కేబీఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు టి.డి. జనార్దన్, ఈగల్ టీమ్ ఎస్పీ నాగేష్ ఐపీఎస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ యువతలో చైతన్యం నింపే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

గురుకులాల్లో అడ్మిషన్ల నుంచి పూర్తి పారదర్శకత పాటించాలి

- విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు
- ఫుడ్ పాయిజన్ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష

హైదరాబాద్, జూన్ 8 (జనంసాక్షి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోని పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలని, విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు. జూన్ విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్) పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అయితే సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు. ఇటీవలి కాలంలో కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనలను ప్రస్తావించిన మంత్రి, గురుకులాల్లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట ప్రక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

పాఠశాలలు, స్టోర్‌రూమ్‌లు, డైనింగ్ హాల్స్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. అకడమిక్ పరంగా ఈ విద్యా సంవత్సరాన్ని మరింత ఫలవంతంగా మార్చేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. పీరియడ్ వారీగా పాఠ్యాంశాల బోధన, వారాంత సమీక్షలు, నెలవారీ విద్యా ప్రగతి నివేదికలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని చెప్పారు.

వెటర్నరీ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్8 (జనంసాక్షి) : జిల్లాలోని వి. వెంకటాయపాలెంలో వెటర్నరీ ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెంకటాయపాలెం గ్రామానికి జిల్లాలో ఓ చరిత్ర ఉందన్నారు. ఎన్టీరామారావుతో ఈ గ్రామానికి వచ్చి ఇక్కడే భోజనం చేసినట్లు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఇక్కడ భూగర్భ జలాలు లేకపోతే లిఫ్ట్ పెట్టమని అడిగితే, ఎన్టీ రామారావు ప్రభుత్వంలో లిఫ్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు.

చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలు

- ఏపికి తరలిస్తున్న 9 లారీల సీజ్

హైదరాబాద్, జూన్ 8 (జనంసాక్షి) : చేపలకు ఆహారంగా ఉపయోగించేందుకు తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు నగరంలో హెచ్ ఫాస్ట్ పోలీసుల బృందం భారీ ఆపరేషన్ చేపట్టింది. చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న 9 లారీలను సీజ్ చేసింది. 120 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకుంది. ఆ వ్యర్థాలను చెరువుల్లో చేపలకు ఆహారంగా వాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని రెండరింగ్ ప్లాంట్‌కు పంపాల్సిన వ్యర్థాలను మళ్లించి ఏపీలోని గుంటూరు, వినుకొండ, అద్దంకి, భీమవరంలోని చెరువులకు వీటిని తరలిస్తున్నట్లు సమాచారం.

కత్తితో దాడి చేసిన నిందితుడికి 14 రోజుల రిమాండ్

చిట్యాల, జూన్ 08(జనం సాక్షి) : భూమి కొనుగోలు విషయమై జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకొని ఒక వ్యక్తిపై కత్తితో ప్రాణాంతక దాడికి తెగబడిన నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చిట్యాల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పోచంపల్లి సతీష్ కుమార్ తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన మహ్మద్ రాజ్ మొహమ్మద్ అతని సోదరుడు అఫ్జల్ ఇద్దరూ కలిసి, ఉదయం అదే గ్రామానికి చెందిన కొండేటి రాజేందర్ అనే వ్యక్తి భూమి నుండి నెలిమెల కుమారస్వామికి సంబంధించిన బండి బాట కొనుగోలు విషయం మాట్లాడటానికి రాజేందర్ ఇంటికి వెళ్ళారు. అదే సమయంలో నెలిమెల కుమారస్వామి భూమిని కౌలు చేస్తున్న చిగురు నరేష్ అనే వ్యక్తి కూడా అక్కడికి వచ్చాడు.ఆ సమయంలో రాజేందర్ తరపున పెద్దమనిషిగా రాజ్ మొహమ్మద్ మాట్లాడుతూ.. గుంట భూమి 4 లక్షలకు అమ్ముతారని చెప్పారు. దీనికి కుమారస్వామి తరపున వచ్చిన చిగురు నరేష్ స్పందిస్తూ.. “మేము రూ.1.8 లక్షలు అయితేనే కొంటాము, అంత రేట్ ఎక్కడిది రా” అంటూ అక్కడ ఉన్న పెద్దమనుషులను అసభ్య పదజాలంతో దూషించాడు. అనంతరం కొత్తపేట శివారులో రాజ్ మొహమ్మద్ ట్రాక్టర్ నడుపుతుండగా అక్కడికి వెళ్లి, రాజ్ మొహమ్మద్‌పై ఒక్కసారిగా కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ దాడిపై సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు తక్షణమే స్పందించి, బాధితుడి అన్న అఫ్జల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు చిగురు నరేష్‌పై కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరుపరచగా, కేసు వివరాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.నిందితుడిని భద్రత నడుమ పరకాల సబ్ జైలుకు తరలించారు.

సంపాదకీయం

సహకార ఫెడరలిజం కావాలా? షరతుల రాజకీయం కావాలా?

ఏ తరహా రాజకీయం కావాలి?

భారత రాజ్యాంగం సహకార ఫెడరలిజం స్ఫూర్తిని ప్రతిపాదించింది. కేంద్రం, రాష్ట్రాలు రెండూ సమన్వయంతో పని చేయాలని, జాతీయాభివృద్ధి ఒక ఉమ్మడి బాధ్యత అని రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించారు. అయితే ఈ మహత్తర సూత్రం ఆచరణలో ఎంత మేర పాటించబడుతున్నదో ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన ప్రకటన మళ్లీ ఒకసారి ప్రశ్నార్థకం చేసింది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బహిరంగ వేదికపై మోదీ "మాతో వచ్చేస్తే మీ ఆశయాలు మీ కలలు పూర్తి చేస్తాం, గుజరాత్‌తో సమానంగా అభివృద్ధి చేస్తాం" అని పేర్కొన్నారు. ఈ మాటలు వినడానికి సహకార స్ఫూర్తిలా అనిపించవచ్చు. కానీ అంతర్గత అర్థాన్ని విశ్లేషిస్తే ఇది రాజకీయ నిర్బంధానికి మరొక పేరు అని స్పష్టమవుతుంది. రాష్ట్రానికి చట్టబద్ధంగా రావలసిన నిధులను, అభివృద్ధి పథకాలను అందించడం కేంద్రం కనీస బాధ్యత. అది ఒక పార్టీ మద్దతుకు పెట్టే మూల్యం కాదు.

మోదీ ప్రకటనలో మరింత తీవ్రమైన అంగీకారం దాగి ఉంది. గుజరాత్‌తో సమానంగా నిధులిస్తామని హామీ ఇవ్వడమంటే, ఇప్పటి వరకు గుజరాత్‌కు అసమానంగా నిధులు వెళ్లాయని, తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరగలేదని పరోక్షంగా ఒప్పుకోవడమే అవుతుంది. పదిహేనవ ఆర్థిక సంఘం నివేదికలు, పన్నుల పంపిణీ వివాదాలు, ఉపాధి హామీ నిధుల ఆలస్యం వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాలు పదే పదే మొత్తుకుంటూనే ఉన్నాయి. ఆ అన్యాయాన్ని అడిగినప్పుడు తోసిపుచ్చిన అదే కేంద్రం ఇప్పుడు రాజకీయ విశ్వాసమంటే నిధులు ఇస్తామని అంటున్నది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి తీవ్రమైన విఘాతం.

ఇది ఏదో ఒక్కసారి జరిగిన అనుభవం కాదు. అస్సాంలో హిమంత బిశ్వ శర్మ, పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి వంటి ప్రతిపక్ష నేతలను తమవైపు తిప్పుకొని అధికారాన్ని పొందిన ఎన్డీఏ చరిత్ర ఇది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డికి చేసిన "మాతో వచ్చేయండి" అన్న పిలుపు కేవలం అభివృద్ధి మాట కాదు, రాజకీయ రిక్రూట్‌మెంట్ వ్యూహంలో భాగమే అని అర్థమవుతుంది. ఒక ముఖ్యమంత్రి మీ పార్టీలో చేరితేనే మీ రాష్ట్రానికి అభివృద్ధి అనే సందేశం ప్రజాస్వామ్య విలువలకు నేరుగా సవాలు విసురుతున్నది.

రాష్ట్ర ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ప్రభుత్వం ఒక పార్టీది. కేంద్రంలో అధికారంలో ఉన్నది మరొక పార్టీ. ఈ రెండింటి మధ్య విభేదాలు ఉండవచ్చు, అవి సహజమే. కానీ ఆ విభేదాల కారణంగా రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగ హక్కులను నిలిపివేయడం, అభివృద్ధిని రాజకీయ తారాజువ్వగా మార్చడం సహకార ఫెడరలిజానికి సంపూర్ణ విరుద్ధం. భారత రాజ్యాంగం ఏ పౌరుడినీ, ఏ రాష్ట్రాన్నీ పార్టీ విధేయత ఆధారంగా వివక్షకు గురిచేయకూడదని స్పష్టంగా నిర్దేశిస్తున్నది.

తెలంగాణ రాష్ట్రం పదేళ్ల చిన్న రాష్ట్రం. మౌలిక సదుపాయాలు, నీటిపారుదల, ఉపాధి కల్పన వంటి అనేక సవాళ్లతో కుస్తీపడుతున్నది. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం కేంద్రం నిష్పక్షపాతంగా, రాజ్యాంగ బాధ్యతగా సహకరించాల్సిందే. అది ఏ పార్టీ అనుకూలత మీద ఆధారపడే ప్రశ్నే కాదు. "మాతో వచ్చేస్తే" అన్న నాలుగు మాటలు సహకార ఫెడరలిజం అంటే ఏమిటో అర్థం చేసుకోని పాలకుల మనస్తత్వాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వం పార్టీ విస్తరణకు రాష్ట్ర నిధులను పావుగా వాడటం ప్రజాస్వామ్యానికి తీరని అవమానం.

రాజ్యాంగం శ్వాసిస్తోందా... శవమై మిగిలిందా?

దేశంలో రాజ్యాంగం చనిపోలేదు కానీ దాని ఆత్మను ఏరోజో, ఏ అర్ధరాత్రో నిశ్శబ్దంగా హత్య చేశారు. చట్టసభల అల్మారాల్లో ఆ పవిత్ర గ్రంథం ఇంకా మిగిలే ఉంది. పదవుల స్వీకరణ వేళ సాగే ప్రమాణ స్వీకారాల ఆర్భాటం అలాగే సాగుతోంది. ఆ ముఖపత్రం మీద బాబాసాహెబ్ అంబేద్కర్ గంభీర వదనం అలాగే ప్రకాశిస్తోంది. కానీ న్యాయం ఎక్కడ? సమానత్వం ఎటుపోయింది? స్వేచ్ఛ ఏ తీరాలకు కొట్టుకుపోయింది? అవి ఎక్కడో లగ్జరీ అధికార మందిరాల్లో, కోర్టు ఫైళ్ళ దుమ్ము కొట్టుకుపోయిన మూల్గుల్లో, వ్యవస్థల నటిస్తున్న నిద్రలో కప్పబడి పడున్నాయి. మబ్బులు కమ్మిన ఆకాశంలో చంద్రుడిలా రాజ్యాంగ స్ఫూర్తి మసకబారిపోతోంది. నవంబర్ 26,1949 ఆ చారిత్రక రోజున ఈ దేశం తనకు తానుగా ఒక అద్భుతమైన వాగ్దానం చేసుకుంది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఈ నాలుగు పదాలు కేవలం ప్రవేశిక లోని అక్షరాలు కావు, అవి ఒక సామాజిక విప్లవ ప్రతిజ్ఞ. ఏడు దశాబ్దాల సుదీర్ఘ కాలం దాటిపోయింది. ఆ ప్రతిజ్ఞ నేడు ఎంతవరకు నిలబడింది? గుండెల మీద చేయి వేసుకుని, నిజాయితీగా మనం సమాధానం చెప్పగలమా? నేడు రాజ్యాంగం పౌరులను రక్షించాల్సింది పోయి, పౌరులే వీధుల్లోకి వచ్చి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇది విధి వైచిత్ర్యమా లేదా వ్యవస్థల నైతిక వైఫల్యమా?ఈ దేశంలో వెన్నెముక లాంటి రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కును ప్రసాదించింది కానీ, వాడు పండించిన పంటకు గిట్టుబాటు ధరను మాత్రం ఇవ్వలేకపోయింది. దళితుడు నడిరోడ్డుపై కొట్టబడుతున్నాడు ఆర్టికల్ 17 అస్పృశ్యతను రద్దు చేసినట్లు చట్టాల పుస్తకాల్లో రాసుకున్నాం కానీ, సమాజంలో వేళ్ళునుకున్న మనువాద మనోవ్యాధిని మాత్రం రద్దు చేయలేకపోయాం. స్త్రీ నేటికీ అర్ధరాత్రి కాదు కదా పట్టపగలు కూడా వీధుల్లో భయంతో అడుగులు వేస్తోంది. ఆర్టికల్ 15 లింగ వివక్షను కఠినంగా నిషేధించినా, మగ అహంకారపు చీకటి ఆకాశం ఆమెపై నిరంతరం నీడలా కమ్ముకునే ఉంది. రాజ్యాంగ అక్షరాలు కాగితంపై రత్నాల్లా మెరుస్తున్నాయి.. కానీ క్షేత్రస్థాయిలో అమలు? అది మాత్రం నిరంతర కుంభకర్ణ నిద్రలోనే మునిగిపోయింది. న్యాయస్థానాలను మనం రాజ్యాంగ సంరక్షకులుగా, ప్రజాస్వామ్యానికి చివరి ఆశాకిరణాలుగా కొలుస్తాం. కానీ ఈ దేశంలో నాలుగు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో మగ్గుతున్నాయనే పచ్చి నిజాన్ని ఎలా జీర్ణించుకోవాలి? ఇక్కడ న్యాయం వస్తుంది కానీ ముసలితనంలో, లేదంటే ఇరవై ఏళ్ళ సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వస్తుంది. అప్పటికి వాది చనిపోతాడు, ప్రతివాది స్మశానానికి చేరువవుతాడు, సాక్షులు సైతం కాలగర్భంలో కలిసిపోతారు. "Justice delayed is justice denied" అని ఆంగ్లంలో ఒక సూక్తి ఉంది మన వాడుక భాషలో చెప్తే ఆలస్యమైన న్యాయం అన్యాయంతో సమానం. నేడు న్యాయం అనేది కార్పొరేట్ శక్తులకు, కొనగలిగే ధనవంతులకు మాత్రమే దాసోహమంటోంది. పేదవాడికి మాత్రం జైలు గోడలే దిక్కవుతున్నాయి. ఇదేనా బాబా సాహెబ్ కలలుగన్న రాజ్యాంగ స్ఫూర్తి?ప్రాథమిక హక్కులు ఈ రెండు మాటలు వింటే ప్రతి పౌరుడి గుండె గర్వంతో ఉప్పొంగాలి. స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ, మతాచరణ, సమానత్వం మనకు లభించిన ఆయుధాలు. కానీ నేడు ఒక పాత్రికేయుడు పాలకుల తప్పులను ఎండగడుతూ నిజం రాసినందుకు జైలు పాలవుతున్నాడు. ఒక విద్యార్థి సమాజాన్ని ప్రశ్నించినందుకు దేశద్రోహిగా ముద్ర వేయించుకుంటున్నాడు. ఒక కళాకారుడు వ్యవస్థల లోపాలను కవితగా మలిచినందుకు నిఘా నీడలో చిక్కుకుని వేటాడబడుతున్నాడు. రాజ్యాంగం ప్రసాదించిన పౌర స్వేచ్ఛ ఏమైపోయింది? దానిని ఏ అధికార దురహంకార వ్యవస్థ మింగివేసింది?భారత రాజ్యాంగం ఈ దేశాన్ని ఒక అద్భుతమైన సమాఖ్యగా (ఫెడరలిజం) నిర్వచించింది. కేంద్రం, రాష్ట్రాలు పరస్పర గౌరవంతో, సమాన హక్కులతో కలిసి సాగాలని నిర్దేశించింది. కానీ నేడు రాష్ట్రాల స్వాయత్తత అనేది ఒక హేళనగా మారిపోయింది. ఆర్థిక వనరులన్నీ కేంద్రం గుప్పిట్లోకి వెళ్ళిపోయాయి. కీలక నిర్ణయాలన్నీ ఢిల్లీ మేడల నుంచే శాసించబడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిధుల కోసం, హక్కుల కోసం యాచకుల్లా ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. కోఆపరేటివ్ ఫెడరలిజం అనేది కేవలం పాలకుల ప్రసంగాలకే పరిమితమైంది ఆచరణలో మాత్రం కంట్రోల్ ఫెడరలిజం రాజ్యమేలుతోంది. ఈ వైఖరి వల్ల దేశంలోని బహుళ సంస్కృతులు, వేలాది కులాలు, మతాలు, భాషల బహువచన సౌందర్యం ముక్కలైపోయే ప్రమాదం ఏర్పడింది.
అంబేద్కర్ ఆనాడు ఒక చారిత్రక సత్యాన్ని చెప్పారు ఒక వ్యక్తికి, ఒక ఓటు; ఒక ఓటుకు, ఒకే విలువ. కానీ నేటి కార్పొరేట్ రాజకీయాల్లో డబ్బున్న వాడికి వంద ఓట్లు కొనే శక్తి ఉంది, నీతిగా బతికేవాడికి ఒక్క ఓటు విలువ కూడా దక్కడం లేదు. ఇది నిజంగా ప్రజాస్వామ్యమేనా లేక ముసుగు వేసుకున్న సంపన్నస్వామ్యమా? ఎన్నికలు రావడం, పోవడం ఒక ప్రహసనంగా మారింది. ఐదేళ్ళకోసారి ఓటు వేసేటప్పుడు మాత్రమే ప్రజలు రాజులవుతున్నారు మిగతా నాలుగేళ్ళు పాలకుల ముందు మోకరిల్లే యాచకులుగా మిగిలిపోతున్నారు. ఓటు వేసి ప్రజాప్రతినిధులను గెలిపించిన తర్వాత, వారిని ప్రశ్నించే హక్కు ఈ సామాన్యుడికి ఉందా? జవాబుదారీతనాన్ని అడిగే ధైర్యం ఉందా? రాజ్యాంగం ఉందనే చెప్తోంది. కానీ ప్రశ్నించిన గొంతులు నులిమివేయబడుతున్నాయి. ధర్నా చేసే చేతులు కట్టడి అవుతున్నాయి. ఆందోళనకారులపై లాఠీలు విరుగుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యమా, లేక నియంతృత్వమా?ఇక్కడ ఒక కఠోర సత్యాన్ని ఒప్పుకోవాలి. రాజ్యాంగాన్ని రక్షించాల్సింది కేవలం ఏసీ రూముల్లో కూర్చునే న్యాయమూర్తులు కాదు, చట్టసభల్లోని రాజకీయ నాయకులు కాదు, రాష్ట్రపతి భవన్ కాదు దానిని రక్షించాల్సింది మీరు, నేను, మనమంతా! పౌరులమైన మనమే దానికి రక్షణ కవచం. అంబేద్కర్ ఒక సందర్భంలో తీవ్రంగా హెచ్చరించారు రాజ్యాంగం ఎంత మంచిదైనా, దాన్ని అమలు చేసే వాళ్ళు చెడ్డవాళ్ళైతే అది చెడిపోతుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదైనా, దాన్ని నడిపించే వాళ్ళు మంచివాళ్ళైతే అది అద్భుతాలు సృష్టిస్తుంది. ఈ మాటల్లోని లోతును మనం గ్రహిస్తున్నామా? వ్యవస్థలను నిలబెట్టేది కేవలం యాంత్రికమైన తంత్రాంగం కాదు, పాలకులలో ఉండాల్సిన మానవీయ నిబద్ధత!నేడు మన సమాజంలోని చదువుకున్న వర్గం మేధావులుగా చెలామణి అవ్వడానికి ఇష్టపడుతుంది కానీ, కళ్ళ ముందు అన్యాయం జరుగుతున్నప్పుడు గొంతు విప్పడానికి భయపడుతుంది. సోషల్ మీడియాలో విప్లవాత్మకమైన పోస్టులు, లైకులు కొడతారు కానీ, అదే అన్యాయంపై రోడ్డు మీద నిలబడి పోరాడటానికి వెనకడుగు వేస్తారు. పొరుగువాడు అన్యాయానికి గురై రోదిస్తున్నప్పుడు నాకెందుకు వచ్చిన గొడవ అంటూ తలుపులు మూసుకుంటున్నారు. ఇది చైతన్యమా లేక పిరికితనానికి వేసుకున్న మేథో వేషమా? రాజ్యాంగ స్ఫూర్తి కేవలం సెమినార్లలో, వ్యాసాల్లో, ఆవేశపూరిత ఉపన్యాసాల్లో బతికితే సరిపోదు అది మన నిత్యజీవితంలో, మన ప్రతి నిర్ణయంలో, మనం వేసే ప్రతి ప్రశ్నలో ప్రతిబింబించాలి.
ఈ వ్యాసం చదువుతున్న పాఠకులారా ఒక్క క్షణం ఆగండి. గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించండి. మీ చుట్టూ జరుగుతున్న సామాజిక అన్యాయాలకు మీరు కేవలం మూగ ప్రేక్షకులుగా మిగిలిపోతున్నారా? లేక వాటిలో పరోక్ష భాగస్వాములా? లేక ధైర్యంగా ప్రతిఘటించే వీరులా? రాజ్యాంగం మీకు అమూల్యమైన ఓటు హక్కును ఇచ్చింది మీరు దానిని విజ్ఞతతో, వివేకంతో వేస్తున్నారా లేక నోట్లకు, మద్యం సీసాలకు అమ్ముకుంటున్నారా? రాజ్యాంగం మీకు భావప్రకటన స్వేచ్ఛను ఇచ్చింది మీరు దానిని నిజాలు మాట్లాడటానికి వాడుతున్నారా లేక సోషల్ మీడియాలో ద్వేషాన్ని, మతాంధతను వ్యాప్తి చేయడానికి వాడుతున్నారా? గుర్తుంచుకోండి నిద్రపోతున్న సమాజానికి రాజ్యాంగం ఎప్పటికీ రక్షణ కవచం కాలేదు. నిరంతరం మేల్కొనే ఉండే పౌరుడే అసలైన రాజ్యాంగ రక్షకుడు. లేవండి ఇది మీ సమయం, ఇది మీ హక్కుల పోరాటం, ఇది మీ దేశ భవిష్యత్తు. విప్లవం అంటే చేతుల్లో తుపాకులు పట్టుకోవడం కాదు వ్యవస్థల లోపాలను నిలదీసి ప్రశ్నించడం! చైతన్యం అంటే కేవలం జైకొట్టే నినాదాలు చేయడం కాదు అన్యాయం ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ మోకరిల్లకపోవడం! రాజ్యాంగ స్ఫూర్తి అంటే ఇంట్లో అంబేద్కర్ ఫోటో తగిలించుకోవడం కాదు ఆయన ఆశించిన, జీవించిన మానవీయ విలువలను మన జీవితాల్లో నిలబెట్టుకోవడం. ఈ కుళ్ళిన వ్యవస్థను బాగుచేయడానికి కేవలం అక్షరాస్యత (డిగ్రీలు) సరిపోదు, సామాజిక చైతన్యం కావాలి. ఆ చైతన్యమే అసలైన రాజ్యాంగ స్ఫూర్తి. ఈ దేశ భవిష్యత్తు ఏ ఒక్క రాజకీయ నేత చేతుల్లోనూ లేదు, ఏ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోనూ లేదు, ఏ సిద్ధాంతపు పాత పుస్తకాల్లోనూ దాగి లేదు అది కేవలం ఓటరుగా మీ చేతుల్లోనే ఉంది. ప్రజలు మేల్కొంటే రాజ్యాంగం సజీవంగా శ్వాసిస్తుంది. ప్రజలు నిద్రపోతే రాజ్యాంగం కేవలం నిర్జీవమైన కాగితాల కట్టగా మిగిలిపోతుంది. ఇప్పుడు తేల్చుకోండి మీరు చైతన్యవంతమైన పౌరుల వరుసలో నిలబడతారా లేక దేశం నాశనమవుతుంటే చూసే మూగ ప్రేక్షకుల వరుసలో కూర్చుంటారా? రాజ్యాంగ స్ఫూర్తి ఇంకా చనిపోలేదు అది మీ గుండెల్లో నిగూఢంగా నిద్రపోతోంది. దాన్ని మేల్కొలపడానికి మీలోని ఒకే ఒక్క చైతన్య జ్వాల చాలు. ఆ జ్వాల మీరే కావాలి ఆ మార్పు మీతోనే మొదలవ్వాలి.
జై భీమ్.. జై సంవిధాన్!

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి!

భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ భావ ప్రకటన స్వేచ్ఛను సమానంగా కల్పించినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరి కారణంగా ప్రశ్నించే గొంతులను, ప్రతిపక్షాలను అణిచివేయడమే లక్ష్యంగా కేంద్రంతో అంట కాగిన జనసేన ముందుకు పోతుంది.ఇది తెలంగాణ, ఆంధ్ర పంచాయతీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తూ ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె నాగేశ్వర్ పై సామాజిక మాధ్యమాల్లో మూకుమ్మడి దాడికి దిగడం వారి అవివేకమే. ప్రొఫెసర్ నాగేశ్వర్ లౌకిక విలువలకు ప్రాణం పోస్తూ, నిఖచ్చితంగా అమలు చేస్తున్న గొప్ప మనిషి. కులానికి ,మతానికి బానిస కాలేదు, మతం,వ్యక్తి,విశ్వాసాలకు సంబంధించినది అని నమ్మిన వ్యక్తి, అటువంటిది ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఆచార్యుని పై పని కట్టుకొని నోరు మూయించే పనిలో తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేవిధంగా పవన్ కళ్యాణ్ దంబాచారం చేయడం సహించరానిది. ఆధిపత్యం చలాయించడానికి సనాతన ధర్మ రక్షణ పేరిట,సగటు పేదవాన్ని మతపు సంకెళ్లతో కట్టి వేయాలనేది నీచమైన ఆలోచన. ప్రశ్నించే వ్యక్తుల ప్రాధాన్యతను తగ్గించడం కోసం రచయితలపై, విశ్లేషకులపై దాడి చేయడం క్షమించరాని నేరం ఇది రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక, సామ్యవాద స్ఫూర్తికి భంగం కల్గించడమే.భావ వ్యక్తీకరణకు జవాబు చెప్పకుండా ఇంత రాదాంతమా ?అసలు కథ వేరే ఉందని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. అయితే ఇది మానవుడిలో పెరుగుతున్న ప్రశ్నించే తత్వాన్ని మరుగున పరిచే ప్రయత్నమే. ఏమి ఆలోచించి చేస్తున్నారో ఆచార్యుని అంతరంగం తెలియకుండా ట్రోల్ చేయడం రాజకీయ విశ్లేషణపై విమర్శలు దిగజారుడుతనానికి నిదర్శనం.
భారత రాజ్యాంగ నిబంధనలు పౌరుల ప్రాథమిక హక్కులను ,సమాజ ఉమ్మడి ప్రయోజనాలను సమతుల్యం చేసే బాధ్యతను న్యాయ వ్యవస్థకు అప్పగించాయి. పౌరుల భావప్రకటన స్వేచ్ఛను ,పత్రికా రంగానికి గల సమాచార హక్కును కాపాడటం ప్రజాస్వామ్య మనుగడకు అత్యంతావశ్యకం. సామాన్యుడిగా ప్రొఫెసర్ నాగేశ్వర్ పై విమర్శలు,వ్యక్తిగత వేధింపులు అతివాద ధోరణినిప్రశ్నించక తప్పడం లేదు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ అమిత్ షా ను కల్సి జగన్ ను జైలుకు పంపమని చెప్పారని, దానికి అమిత షా ససేమిరా ఒప్పుకోలేదని, సీరియస్ అయ్యాడని ఊహాజనితలు వ్యక్తీకరించడం మండిందేమో కానీ, భవిష్యత్ లో చంద్రబాబు తాత్కాలిక స్నేహితుడని , బీజేపీ కి బలమైన నమ్మకమైన వ్యక్తి వైఎస్ జగన్ అంటూ విశ్లేషణ చేస్తున్న క్రమంలో ఆయనకు ఉన్న రిసోర్స్ ఎక్కడో లేకుండా మాట్లాడిన సందర్భం ఉండదు.అయితే దీనికి జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భుజాలు తడుముకోవడానికి కారణం ఏమిటి? అటు చంద్రబాబు మెప్పుకోసమా ? అమిత్ షా ఎత్తుగడలో భాగమా? ఇంత ఆరాటం దేనికి అనే ప్రశ్న తెలంగాణ రాష్ట్రంలో మేధావులనుండి వస్తున్నది.మూడు రోజుల వరకు నోరు మెదపని జనసేన మనోహర్ స్పందించడం, గొడవను తగ్గించేందుకు ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించు కుంటున్నాని మీడియా ముఖంగా చెప్పడం చక చక జరిగింది. ప్రొఫెసర్ విశ్లేషకుడిగా మాట్లాడిన అంశం అంతా చర్చ చేసేంత ఏమిలేదు? రాజకీయాల్లో భాగంగా మాజీ ఎంఎల్ సి గా మాట్లాడి ఉండొచ్చు కదా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)ఏ) చాలా జాగ్రత్తగా పత్రికా స్వేచ్ఛను, భావ స్వాతంత్రతను ఉపయోగిస్తున్న రచయిత, పాత్రికేయుడు.విశ్లేషకుడు ఆచార్య నాగేశ్వర్ గోకితే.. ఆంధ్ర,తెలంగాణ సెంటిమెంట్ ట్రోల్ కావడం దురదృష్టకరమే.
రాజకీయాల్లో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నా స్పందించని పార్టీలు విశ్వవిద్యాలయం పంతులు పై బురదచల్లి ఆయనకు ఉన్న పేరు ప్రతిష్టలకు భంగం కల్గించాలని ఉగిసలాడుతున్నది. ఆయన ఆర్టికల్ 19(2) అనేక సమంజస ఆంక్షలు ఎన్ని ఉన్నా ఆ పరిధిలోనే మెదిలిన గొప్ప రచయిత పై నిప్పులు చెరుగుతున్నారు.నిజంగానే పవన్ కళ్యాణ్ పై ముగ్గురు భార్యలని, ఓటమి తర్వాత రాజకీయాలు చేయలేదని ఎన్నో చివాట్లు పెట్టిన, అవమానాలు చవిచూసిన జనసేన సీరియస్‌గా స్పందించడానికి వైఎస్సార్సీపి గ్రాఫ్ మెరుపు దాడి వెనుక రాజకీయ కోణం ఉందనే ఆలోచన అందరిలో కల్గింది.ఇక ఆచార్యునిపై కేసులు పెట్టి రాదంతం చేస్తే ప్రయోజనం పొందేది ఎవరు? నాడు అనాలోచితంగా చంద్రబాబును అరెస్టు చేసి,కేవలం 11సీట్లకే పరిమితం అయినా జగన్ ఇమేజ్ అమాంతం పెరిగే విధంగా ప్రొఫెసర్ మాట్లాడినారనే కోపం కట్టలు తెంచుకోవడానికి కారణం అయ్యింది.దీనికి ఆజ్యం పోసినట్టుగా కేసులు అంటూ ఇంటికి పోలీసులు వచ్చారని తెలంగాణ ప్రభుత్వం సహకరించడం లేదని, జర్నలిస్టులు, ప్రజాసంఘాలు మొత్తుకోవడం కొనసాగుతున్నది. తతంగం చుస్తే పవన్ కళ్యాణ్ ను ముందు పెట్టి, జీహెచ్ ఎం సి ఎన్నికల్లో ఆంధ్ర,తెలంగాణ సెంటిమెంట్ రగిలించి, నాలుగు ఓట్లు సంపాదించాలనే కుట్ర కన్పిస్తున్నది. ఇదిలా ఉంటే నేను అరెస్టు కు భయపడి ముందస్తు బెయిల్ తీసుకునేంత పనిచేయను అని ప్రొఫెసర్ నాగేశ్వర్ సుస్పష్టంగా వెల్లడించారు.వెంకీ పెళ్లి సుబ్బు చావుకొచ్చినట్టు బండి భగీరథ్ చర్చ పక్కకు పోయి, తెలంగాణ అంతాకూడా ఒక్కసారిగా అటెన్షన్ కు గురైంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు,శాశ్వత మిత్రులు ఉండరు వీడియోలతో చాలా మంది వీడిపోయే మిత్రులు చాలా మంది ఉంటారు.ఈ సందర్భంలో ప్రధాన పత్రికల్లో వస్తున్నా వార్తలకు ఆధారాలు ఉన్నాయా? అంటూ ఎదురు దాడి చేయడం గమనార్హం.
తెలంగాణ ఒక రాష్ట్రం మాత్రమే కాదు,ఎందరో ఉద్యమకారులను కన్నా ఈ నేల ఆత్మగౌరవ ప్రతీక.పవన్ కళ్యాణ్ లాంటి వారికీ తెలియంది ఏమిటంటే ఈ గడ్డ స్పందన,సున్నితత్వం అర్థం చేసుకోకుండా చేసిన విశ్లేషణ ట్రోలింగ్ సహజంగానే ప్రతిస్పందనకు దారితీస్తుంది. నాగేశ్వర్ వంటి రచయితలు పత్రికా స్వేచ్ఛకోసం రిట్ లు వేసే అవసరం తెస్తున్నారు. కాని ఎన్ని రిట్ లు వేసినా దొరకని, రాజ్యాంగ పీఠికలో మనం రాసుకున్న విలువలైన స్వేచ్ఛను తిట్లతో హరిస్తున్నారు. ఇల్లు అలకగానే పండుగ కాదు సుమా? మీరు ఎన్ని తిట్టినా, తెర వెనుక ఉన్న పార్టీలను తన గళంతో వీడియో ద్వారా, కలంతో ఒక వ్యాసం ద్వారా,పరాజయం చేయించ గలిగిన బ్రహ్మాస్త్రాలు విశ్లేషకుల, రచయితల అమ్ములపొదిలో పొదిగి ఉంటాయి. మిడిమిడి తెలివితో మీడియాను వాడుకునే వాడు రాజకీయాలకు ఎప్పటికి పనికి రాడు, దేశానికి కావాల్సింది పౌరశక్తి కలిగిన వాడు, ఒక భారతీయుడు కావాలి. అటువంటిది 12 ఏళ్లతర్వాత కూడా తెలంగాణ, ఆంధ్ర అని సెంటిమెంట్ కాదు, మనకు దేశ భక్తుడు కావాలి. అలాగని తిట్టే ప్రతివాడు దేశ భక్తుడు కాదు. పవన్ దగ్గర ఏమి ఆశించి టాస్క్ ఇచ్చారో .. దీని వెనుక ఎవరు ఉన్నారో తెలంగాణ సమాజానికి అర్థం అయ్యింది. ఆచార్యుని పియా కుట్రల వెనుక పెద్ద తతంగం లేకపోలేదు. అయినా తెలంగాణ బిడ్డకు భయం ఉండదు, కానీ అందరూ లేని భయం నేర్పుతున్నారు. కావలసింది ధైర్యం. బోలెడంతా ధైర్యం ఉంది. అందుకే ఒక్కొక్క అక్షరం, వీడియోలో మీకు కనపడే, వినపడే అక్షరం – ఒక అస్త్రం. ఆయన పై వాడిన ఒక్కొక్క తిట్టు ఆయనకు దీవెనలు అన్న సంగతి పూర్తిగా మర్చిపోయారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మరింత రెట్టింపుతో తన నోటి నుండి ఎన్ని మిస్సైల్స్ వదలుతారో అనే భయం అందరిని వెంబడిస్తున్నది.

ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్,
విభాగాధిపతి, జర్నలిజం శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్. 9866255355.

విద్య హక్కు... వ్యాపారం కాదు!

కార్పొరేట్ విద్యా దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి

అ,ఆ,లు, A,B,C,D,లు నేర్చుకోవాలంటే మన రాష్ట్రంలో లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర రాజధాని నుంచి జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండలాల వరకు "లక్షలు చెల్లిస్తేనే నాణ్యమైన విద్య" అన్న పరిస్థితి నెలకొనడం అత్యంత ఆందోళనకరం. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని భారీ దోపిడీకి పాల్పడుతున్నాయి.
గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి, ప్రస్తుత ప్రభుత్వ పర్యవేక్షణలో లోపాల కారణంగా రాష్ట్రంలో విద్యా వ్యాపారం పూర్తిగా అదుపు తప్పింది. నర్సరీ నుంచి పదో తరగతి వరకు పిల్లలను చదివించాలంటే మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. ప్రతి ఏడాది విద్యాసంస్థలు 20 శాతం నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచుతుండగా, ఇటీవల కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు 100 శాతానికి పైగా ఫీజులు పెంచిన ఉదాహరణలు వెలుగులోకి రావడం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూపిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును పెట్టుబడిగా మార్చి విద్యను పూర్తిగా వ్యాపార వస్తువుగా మార్చడం బాధాకరం.
ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ ఫీజు, డొనేషన్, బిల్డింగ్ ఫండ్, యాక్టివిటీ ఫీజు వంటి పేర్లతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నాయి. పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, టైలు, నోట్‌బుక్స్‌ను నిర్దిష్ట దుకాణాల నుంచే కొనాలని బలవంతం చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వం పుస్తకాల అమ్మకాలపై నిషేధం విధించినప్పటికీ చాలా విద్యాసంస్థలు బహిరంగంగానే నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం మరింత దురదృష్టకరం.
రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్కూల్ ఫీజు రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటు చేసి ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి. యాజమాన్యాలు స్వేచ్ఛగా ఫీజులు పెంచకుండా చట్టబద్ధ నియంత్రణ తీసుకురావాలి. ప్రతి విద్యాసంస్థ తమ ఫీజు నిర్మాణాన్ని ప్రజలకు వెల్లడించడం తప్పనిసరి చేయాలి. డొనేషన్ల పేరుతో జరుగుతున్న దోపిడీని పూర్తిగా అరికట్టాలి.
రాష్ట్రంలో అనుమతులు లేకుండా అనేక పాఠశాలలు, అకాడమీలు, ఇంటర్నేషనల్ స్కూల్స్ పేర్లతో విద్యాసంస్థలు నడుస్తున్నాయి. తప్పుడు ర్యాంకులు, ఫేక్ రిజల్ట్స్, ఆకర్షణీయ ప్రకటనలతో తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేపడుతున్నాయి. సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా పాఠశాలలు నడుస్తున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి అనే ప్రజలు భావిస్తున్నారు. అనుమతులు లేని పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడితే బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్నకు సమాధానం లేదు.
ప్రభుత్వం తప్పనిసరిగా,

1.ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లేని పాఠశాలలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా నడుస్తున్న విద్యాసంస్థలను మూసివేయాలి.

2. తప్పుడు ప్రకటనలు ఇచ్చే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

3. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న యాజమాన్యాలను బ్లాక్‌లిస్టులో పెట్టాలి.

4. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

5.గుర్తింపు పొందిన పాఠశాలల జాబితాను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి.

ప్రతి విద్యా సంవత్సర ప్రారంభంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి భారీ దోపిడీకి పాల్పడుతున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. కొంతమంది అధికారులు రాజకీయ నాయకులతో కుమ్మక్కై యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం జిల్లా వారీగా విద్యాశాఖ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి అవినీతి, నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలి.

RTE అమలుకు ప్రత్యేక శ్రద్ధ

1.విద్య హక్కు చట్టం (RTE)ను రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలి.

2.ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వడం తప్పనిసరి చేయాలి. 3.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి.

4.విద్యను ధనికులకు మాత్రమే పరిమితం చేసే పరిస్థితిని అరికట్టాలి.

అంఖ్యల గారడిని నియత్రించాలి.

ఎల్‌కేజీ నుంచే పరీక్షలు, ర్యాంకులు, హోంవర్క్ పేరుతో చిన్నారులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెరుగుతోంది. మార్కుల కోసం విద్యార్థులను వేధించే విధానాలు పిల్లల్లో భయం, ఆందోళన, ఆత్మవిశ్వాస లోపానికి దారితీస్తున్నాయి. పాఠశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలు కూడా పూర్తిగా విస్మరించబడుతున్నాయి. అగ్నిమాపక సదుపాయాలు లేకపోవడం, స్కూల్ బస్సుల్లో నిబంధనలు పాటించకపోవడం, బాలల భద్రతపై నిర్లక్ష్యం ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తోంది. ప్రతి పాఠశాలకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, సీసీ కెమెరాలు, బాలల భద్రత కమిటీలు తప్పనిసరి చేయాలి.

కార్పొరేట్ దోపిడీని నిర్మూలించాలి.

కార్పొరేట్ విద్యాసంస్థలు ఉపాధ్యాయులను కూడా తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయి. తక్కువ జీతాలు, అధిక పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస వేతనాలు అమలు చేసి ఉపాధ్యాయుల హక్కులను రక్షించాలి.
గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి రావడం మరింత ఆందోళనకరం. గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, డిజిటల్ విద్య అందుబాటులో లేకపోవడం వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించడమే ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి శాశ్వత పరిష్కారం. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి.
ఈ విద్యా సంవత్సరంలో అయినా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రజా ఆకాంక్షలను గౌరవిస్తూ పనిచేయాలి. విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా రాజ్యాంగబద్ధ హక్కుగా చూడాలి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కార్పొరేట్ దోపిడీని అరికట్టి, పారదర్శకమైన, సమానత్వపూర్వకమైన విద్యా వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
"విద్య అమ్మకానికి కాదు...ప్రతి పిల్లవాడి హక్కు"
కార్పొరేట్ ఫీజుల విధానాన్ని నిర్మూలించి, న్యాయమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత.

జి.రమేష్ కుమార్
ఏఐఎస్ఓ విద్యార్థి నాయకులు
9652020408

వ్యవసాయాభివృద్ధికి నర్మదా క్రాప్ కేర్ కృషి

- రైతుల సంక్షేమమే సంస్థ లక్ష్యం
- చైర్మన్ తిప్పారెడ్డి

మొయినాబాద్, జూన్ 8 (జనంసాక్షి) : నాణ్యత, విశ్వసనీయత, నవీనతకు ప్రాధాన్యమిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి నర్మదా క్రాప్ కేర్ కృషి చేస్తున్నదని సంస్థ చైర్మన్ తిప్పా రెడ్డి తెలిపారు. సంస్థ ఆవిర్భావం నుంచి రైతులకు నాణ్యమైన అగ్రో కెమికల్ ఉత్పత్తులు అందిస్తూ వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడుతున్నామని పేర్కొన్నారు. సంస్థ విజయాల్లో ఉద్యోగుల అంకితభావంతో పాటు వినియోగదారులు చూపుతున్న విశ్వాసమే ప్రధాన బలమని ఆయన అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించడం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రసాయనాల రంగంలో అగ్రగామి సంస్థగా ఎదగడమే లక్ష్యమని, రైతులతో దీర్ఘకాలిక అనుబంధాన్ని కొనసాగిస్తూ బాధ్యతాయుత వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. వ్యాపార వృద్ధితో పాటు రైతుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన విజయమని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న వినియోగదారులు, వ్యాపార భాగస్వాములు, శ్రేయోభిలాషులందరికీ తిప్పా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయ రంగానికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ హెడ్ సుగప్ప, డెవలప్‌మెంట్ హెడ్ కృష్ణ, జనరల్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి, ప్రమోషనల్ హెడ్ ఎం. దినేష్ కుమార్ రెడ్డి, ఏరియా సేల్స్ మేనేజర్ (ఏఎస్ఎం) ప్రమోద్ పాల్గొన్నారు.

పంట మార్పిడి వల్ల అధిక లాభాలు

- నాసిరకం విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు
- రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- బురాన్ పూర్ గ్రామ సభలో కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 8 (జనం సాక్షి) : సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వెల్లడించారు. వికారాబాద్ మండలం బురాన్ పూర్ గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచినీటి సరఫరా, వర్షపు నీటిని ఓడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో జిల్లా అరుదైన ఘనతను

కలిగి ఉన్నదని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం నోటిపై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందని తెలిపారు. కాగా, వర్షాభావ పరిస్థితులు తలెత్తినా కూడా పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని నివారించవచ్చని, తద్వారా వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ(ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో కలెక్టర్ అవగాహన కల్పించారు. జూన్ 25 నుండి బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహిస్తారని, వారికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందేలా చొరవ చూపాలన్నారు. గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి డీ.పీ.ఓ జయసుధ, తహసిల్దార్ లక్ష్మి నారాయణ, ఎంపిడిఓ వినయ్ కుమార్,స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ భూసేకరణపై రగిలిన యాచారం

- ఫార్మా సిటీ భూసేకరణపై రగిలిన యాచారం
- హైకోర్టు స్టే ఉన్నా బలవంతపు చర్యలంటూ
- రైతుల భారీ రాస్తారోకో
- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి..

యాచారం, జూన్ 8 (జనం సాక్షి) : ఫార్మా సిటీ భూసేకరణ వ్యవహారం యాచారం మండలంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఫార్మా సిటీ పరిధిలోని భూములకు సంబంధించి గౌరవ హైకోర్టు స్పష్టమైన స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ, ప్రభుత్వ అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ బలవంతంగా భూసేకరణకు పాల్పడుతున్నారని యాచారం మండల పరిధిలోని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాడు బాధిత రైతులంతా ఏకమై యాచారం తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని, ప్రభుత్వానికి మరియు అధికారుల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. అయితే, తాసిల్దార్ కార్యాలయం వద్ద రైతులు గంటల తరబడి నిరసన తెలుపుతున్నప్పటికీ, వారి సమస్యలను వినడానికి

ఎంతకీ తాసిల్దార్ అందుబాటులోకి రాకపోవడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో వారంతా మండల పరిషత్ కార్యాలయం ముందున్న హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపైకి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను పూర్తిగా అడ్డుకోవడంతో ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ రాస్తారోకో సందర్భంగా ఫార్మా వ్యతిరేక ఉద్యమ సమన్వయకర్త కవుల సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. న్యాయస్థానం స్టే ఆర్డర్ ఇచ్చినా సరే, కోర్టు ఆదేశాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ బలవంతంగా భూములు లాక్కోవాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని రక్షించాల్సిన అధికారులే ఇలా చట్టాన్ని ఉల్లంఘించడం సరికాదని, రైతుల భూములను కాపాడుకునే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకులు కానముని గణేష్, మైపాల్ రెడ్డి, అచ్చిరెడ్డి, కొండల్ రెడ్డి, లింగం, శ్రీశైలం, లక్ష్మారెడ్డి తదితరులు ముందుండి నడిపించగా, యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్ నగర్, తాడిపర్తి, కురుమిద్ద గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు, మహిళలు పాల్గొని తమ భూములను ఫార్మా సిటీకి ఇచ్చేది లేదంటూ, న్యాయం జరిగే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వీబీజీరాంజీ పథకంపై ఉపాధి కూలీలకు అవగాహన

- 100 రోజుల నుండి 125 రోజులకు పని దినాలు పెంపు
- బిజెపి మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్

బొంరాస్ పేట, జూన్ 8 (జనం సాక్షి) : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తూ తీసుకొచ్చిన వీబీజీరాంజీ పథకాన్ని జులై 1 నుండి అమలు చేయనుందని మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ అన్నారు.సోమవారం తుంకిమెట్ల గ్రామ శివారులోని చెరువులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.అనంతరము కూలీలకు అవగాహన కల్పించారు.కేంద్ర ప్రభుత్వము వీబీజీరాంజీ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీ పని దినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాగు రావు,నర్సింలు,ఉప్పు జగదీశ్వర్,రాజారాంరెడ్డి,రాజు నాయక్,శేఖర్,రవి, గణేష్ నాయక్, మహేందర్ గౌడ్,శ్రీనివాస్,సతీష్, అనిల్ నాయక్, శ్రీకాంత్,మధు,నిరంజన్,సిద్దు, శ్రీశైలం, జగదీష్,శివ,తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యం

శామీర్‌పేట్, జూన్ 8 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజు పురపాలక సంఘం అలియాబాద్ పరిధిలోని తుర్కపల్లి వార్డు ప్రాంతంలోని 1, 2, 3, 4 వార్డు లలో వార్డు సభలు ఘనంగా నిర్వహించారు. ఈ వార్డు సభలకు పురపాలక సంఘ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పచ్చదనం పెంపు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలతో ప్రత్యక్షంగా చర్చించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్లు వెంకటేష్ , దీప , దాసరి రవి , దీపికలు తమ తమ వార్డుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వార్డు ప్రజల నుండి వచ్చిన సమస్యలు, అవసరాలు, సూచనలను స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.సభలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలు మరియు సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకు రాగా, సంబంధిత అధికారులు వాటిపై స్పందించి పరిష్కార మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన మక్తల్ పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- డీఎస్పీ లింగయ్య

నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 8 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తేదీ 03.06.2026న సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో మరికల్ మండల కేంద్రానికి చెందిన బోడి రాజు (44)ను నిందితులు అల్లెం నాగరాజు, సిరిగిరి భాను ప్రకాష్, ఆనంపల్లి భాస్కర్‌లు ముందస్తు పథకం ప్రకారం తమ వెంట తీసుకెళ్లారు.మృతుడు బోడి రాజు పేరుపై సుమారు రూ.50 లక్షల విలువైన జీవిత బీమా (ఇన్సూరెన్స్) పాలసీ ఉండటంతో, ఆ డబ్బును పొందాలనే ఉద్దేశంతో నిందితులు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది. పథకం ప్రకారం మృతుడికి అధికంగా మద్యం తాగించి సామన్‌పల్లి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ కట్టెలు మరియు రాళ్లతో దాడి చేసి హత్య చేశారు.అనంతరం ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నంలో భాగంగా గాయపడిన బోడి రాజును భాను ప్రకాష్‌కు చెందిన కారులో హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.తదుపరి నిందితులు మృతుడి కుటుం బ సభ్యులకు ఫోన్ చేసి, దండు చౌరస్తా సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిందని, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినప్పటికీ మర ణించినట్లు తప్పుడు సమాచారం అందించారు. ఈ మేరకు తేదీ 04.06.2026న మృతుడి కుటుంబ సభ్యులు మక్తల్ పోలీస్ స్టేషన్‌లో రోడ్డు ప్రమాద మరణంగా ఫిర్యాదు చేశారు.దర్యాప్తులో భాగంగా మక్తల్ ఎస్సై రాజు వాహన

దారుడైన సిరిగిరి భాను ప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, దండు చౌరస్తా వద్ద ఎటు వంటి రోడ్డు ప్రమాదం జర గలేదని తేలింది. దీంతో నిందితులను లోతుగా విచారించగా హత్య కుట్ర వెలుగు లోకి వచ్చింది.దర్యాప్తులో భాగంగా అట్టి కారు డ్రైవర్ భాను ప్రకాష్ ను పోలీసులు తమదైన శైలిలో విచారించగా హత్య చేసింది తమే అని అంగీకరించడం జరిగింది.వారి నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు: ఒక కియా సోనెట్ కారు,నే. టీఎస్ హెచ్ జి 5543 ఆయుధంగా ఉపయోగించిన రాయి, కట్టే నిందితుల వివరాలు ఎ1:అల్లెం నాగరాజు వయస్సు:33, ఎ 2:భాను ప్రకాష్ వయస్సు: 26 గుడిగండ్ల గ్రామం, ఎ3:ఆనంపల్లి భాస్కర్ వయస్సు 30 కులం: ఆనంపల్లి మరణించిన వ్యక్తి బోడి రాజు వయస్సు: 44 ముదిరాజ్, ఈ కేసులో అల్లెం నాగరాజు (33), సిరిగిరి భాను ప్రకాష్ (26), ఆనంపల్లి భాస్కర్ (30)లను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.కేసును వేగంగా ఛేదించి వాస్తవాలను వెలికితీసిన మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై రాజు, ఎ ఎస్సై శంకరయ్య కానిస్టేబుల్ అశోక్, నరేష్, శ్రీకాంత్ దర్యాప్తు బృందంలోని పోలీసు అధికారులను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి

- నిరంజన్ రెడ్డిని సన్మానించిన డాక్యుమెంట్ రైటర్స్

వనపర్తి రూరల్, జూన్ 08 (జనం సాక్షి) : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం వ్యక్తిగత పని మీద సబ్ రిజిస్టర్ కార్యాలయాన్నికి వచ్చిన సందర్భంగా రిజిస్టార్ చంద్రశేఖర్ రెడ్డి సాదరంగా ఆహ్వానించి కార్యాలయ పనితీరు గూర్చి వివరించి ఇంకా కొన్ని మౌలిక వసతులు అందుబాటులోకి రావాలని వివరించారు. రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ గౌడ్ ఆధ్వర్యములో నిరంజన్ రెడ్డినీ సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని హంగులతో రాష్ట్ర స్థాయిలో ఆదర్శవంతమైన కార్యాలయాన్ని నిర్మిస్తామని అన్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న రైటర్స్ మరియు వ్యాపారస్తులను ఆప్యాయంగా పలకరించి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి వెంట కూతురు తేజస్విని మరియు నాయకులు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, సయ్యద్ జహంగీర్, బాగ్యరాజ్, అరుణ్ యాదవ్, ఇమ్రాన్, ముని కుమార్, అలీమ్ తదితరులు ఉన్నారు.

కేవలం రూ.110 కోసం మేస్త్రీ దారుణ హత్య

- ఐదు రోజుల్లో కేసు ఛేదించిన లాలాగుడ పోలీసులు
- ఇద్దరు డెలివరీ బాయ్స్ అరెస్ట్

సికింద్రాబాద్, జూన్ 8 (జనంసాక్షి) : కేవలం 110 రూపాయలు, మొబైల్ ఫోన్ కోసం ఓ అమాయక భవన నిర్మాణ మేస్త్రీని రాళ్లతో బాది దారుణంగా హత్య చేసిన ఘటన లాలాగుడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు రోజుల క్రితం చోటుచేసుకుంది. ఈ ఘోరానికి ఒడిగట్టిన ఇద్దరు డెలివరీ బాయ్స్ గా పనిచేసే వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసారు. వారి వద్ద నుంచి దొంగిలించిన మొబైల్, రూ.110 నగదు, నేరానికి ఉపయోగించిన ఎలక్ట్రిక్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ డీసీపీ నర్సయ్య సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లాకు చెందిన జైప్రకాష్ దేశ్‌ముఖ్ (38) భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 2న కాజీపేటలో పని ముగించుకుని సాయంత్రం సికింద్రాబాద్ చేరుకున్నాడు. మియాపూర్‌లో ఉన్న తన సోదరుడి వద్దకు వెళ్లేందుకు మొండా మార్కెట్ వద్ద ఒంటరిగా నిలబడ్డాడు. అదే సమయంలో తుకారాం గేట్‌కు చెందిన కిరాణా డెలివరీ బాయ్ ధాబీ వినోద్ (30), అడ్డగుట్టకు చెందిన స్విగ్గీ డెలివరీ బాయ్ మక్కల మోహన్ (19) ఒంటరిగా వెళ్లేవారిని దోచుకోవాలనే స్కెచ్‌తో ఎలక్ట్రిక్ బైక్‌పై అక్కడకు వచ్చారు. ఒంటరిగా ఉన్న జైప్రకాష్ ను గమనించి, రైల్వే స్టేషన్‌లో దించుతామని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లకుండా తుకారాం గేట్ రైల్వే బ్రిడ్జ్ బైపాస్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ జైప్రకాష్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న డబ్బు, సామాగ్రి లాక్కోవడానికి ప్రయత్నించారు. అయితే, బాధితుడు గట్టిగా ప్రతిఘటించడంతో ఆగ్రహానికి గురైన నిందితులు.. పక్కనే ఉన్న పెద్ద రాళ్లను తీసుకుని అతని తలపై బలంగా బాదారు. జైప్రకాష్ రక్తపు మడుగులో పడి ప్రాణాలు విడవడంతో, అతని జేబులో ఉన్న కేవలం రూ. 110 నగదు, మొబైల్ ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. జూన్ 3న తెల్లవారుజామున రక్తపు మడుగులో పడి ఉన్న గుర్తుతెలియని శవాన్ని చూసి స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. లాలాగుడ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి ఆధారాలు సేకరించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో, పోలీసులు ఫోటోతో కూడిన లుకౌట్ నోటీసులను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిని చూసిన మృతుడి కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రి మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని జైప్రకాష్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక బృందాలుగా ఏర్పడి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఘటనా స్థల పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను, టెక్నికల్ డేటాను క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితులను గుర్తించి సోమవారం తెల్లవారుజామున వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఏ-1 వినోద్‌పై గతంలో మల్కాజ్‌గిరి పీఎస్‌లో క్రిమినల్ కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అత్యంత వేగంగా ఈ కేసును ఛేదించిన ఎసిపి కె. శశాంక్ రెడ్డి, లాలాగుడ ఇన్‌స్పెక్టర్ టి. అశోక్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ బృందాలను సీనియర్ అధికారులు అభినందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
09 జూన్ 2026

కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలి

పెబ్బేరు, జూన్ 8 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేరేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నా బలమైన సంకల్పంతో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చేపట్టిన రథయాత్ర సోమవారం వనపర్తి జిల్లాలోకి జిల్లాలోకి ప్రవేశించడం జరిగింది. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి పెబ్బేరు పట్టణంలో బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజా ప్రతినిధులు బస్సులో ప్రయాణం చేస్తూ పట్టణంలోని వీధుల గుండా పర్యటించారు. అనంతరం సుభాష్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి ఎంతగానో తోడుపాటునందిస్తుందని ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి అండగా నిలబడుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వడ్డీ లేని రుణాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు చైర్మెన్ లను ప్రత్యేకంగా నియమించిందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వంట ఏజెన్సీలుగా మహిళలే

ఉండటం స్కూల్ విద్యార్థులకు మహిళలే స్కూల్ డ్రెస్లను కుట్టించి ఇవ్వడం ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేయడం మహిళా భాగస్వామ్యంతో సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు మహిళలకు డీజిల్ బంకుల ఏర్పాట్లు రైతు రుణమాఫీ రైతు భరోసా నిరుపేదలకు రైతు ఆత్మీయ భరోసా సన్న వడ్లకు బోనస్, అన్నదాతలకు రాయితీపై వ్యవసాయ ఉపకరణానికి సంబంధించిన అన్ని పనుముట్ల పంపిణీ చేపట్టిందన్నారు. తమ సొంత ఇంటి కల నెరవేరక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు రేషన్ కార్డుల పంపిణీ ఉచిత సన్న బియ్యం పంపిణీ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఫిష్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు పెబ్బేరుల 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు వనపర్తి పెబ్బేరు మున్సిపాలిటీలలో ప్రతి వార్డులో సిసి రోడ్ల నిర్మాణం లాంటి అనేక పథకాలను చేపట్టి నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మండలాధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, జిల్లా డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, బోయల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, గోపాల్పేట మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సత్యశీల రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు యుగంధర్ రెడ్డి, మణిగిల్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ సాగర్ మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెరిగితేనే పర్యావరణ పరిరక్షణ

గద్వాల నడిగడ్డ, జూన్ 8 (జనం సాక్షి) : పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని అదనపు కలెక్టర్ మధు మోహన్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా సోమవారం గద్వాల మండలం కాకులారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే భూగర్భ జలాలను కాపాడుకోగలుగుతామన్నారు. ప్రజలు తమ గృహ సంబంధ తడి, పొడి చెత్తను వేరువేరుగా చేయాలని సూచించారు. ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయరాముడు, ఉప సర్పంచ్ రజాక్, తహసిల్దార్ హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

సదాశివపేట, జూన్ 8 (జనం సాక్షి) : రైతులను మోసం చేస్తూ అధిక ధరలకు ఎరువులు విక్రయించే డీలర్లపై చట్టపరమైన చర్యలు తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, గోదాముల్లో నిల్వ ఉంచిన ఎరువుల వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు తప్పనిసరిగా ప్రదర్శించాలని మండల వ్యవసాయ అధికారి రమేశ్ సూచించారు. ఎరువుల నిల్వల వివరాలను రైతులకు స్పష్టంగా కనిపించేలా ఉంచాలని, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించిన ప్రతిసారీ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు వెంకట్రావు, జలీల్ , రాంరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సఖి కేంద్రంలో విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- సిబ్బంది నిబద్ధతతో పని చేయకుంటే కఠిన చర్యలు
- సఖి కేంద్రం సేవలపై పెద్ద ఎత్తున ప్రచారం అవసరం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, జూన్ 8 (జనం సాక్షి) : సఖి కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలని, నిబద్ధతతో పనిచేయకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాలలోని సఖి కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీ, స్టోర్, సర్వైవర్, కిచెన్, తదితర విభాగాలను తిరిగి పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు ఇతర రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఇటీవల సంరక్షించబడ్డ ఓ మహిళ అదృశ్యం కావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ

కెమెరాలు ఉన్నప్పటికీ పనిచేయకపోతే లాభమేమిటని ప్రశ్నించారు. గత రెండేళ్లలో కేంద్రంకు వచ్చిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హింసకు గురై, ఇతర సమస్యలతో బాధపడుతున్న మహిళలు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, ఇతరాత్ర సమస్యలతో వేదనకు గురైన బాలికలను సంరక్షించేందుకు, కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రంలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. పోలీసు శాఖ నుంచి రిఫర్ చేసిన కేసులే ఇక్కడికి ఎక్కువగా వస్తున్నాయని, సఖి తరపున సంరక్షించబడుతున్న కేసులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. సఖి కేంద్రం అందిస్తున్న సేవలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు చాలా తక్కువ మంది హాజరయ్యారని, పెద్ద ఎత్తున, ఎక్కువ మందికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల్లో సఖి సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోకుంటే నిర్లక్ష్యంగా ఉండే వారిని ఉద్యోగంలో నుంచి తొలగించి, అర్హులైన ఇతరులను తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సఖి కేంద్రం పరిసరాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అక్కడ పొదలు, ఇతర వ్యర్థాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత మహిళలకు రక్షణ, ఆశ్రయం కల్పించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని, అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, టౌన్ జూన్ 08 (జనం సాక్షి) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో కలెక్టరేట్లో 27, సంగారెడ్డి డివిజన్లో 17, ఆందోల్ డివిజన్లో 5, నారాయణఖేడ్ డివిజన్లో 11, జహీరాబాద్ డివిజన్లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. అంతకుముందు, హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రయోజనాలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో దాని ప్రాధాన్యత, అలాగే అతిసార వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, జూన్ 8 (జనం సాక్షి) : వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గల పిల్లి కొట్యాల్ ఏరియాలో గల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిజిహెచ్ఎస్ సూపరిండెంట్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ శర్మిల, జి జి హెచ్ ఎస్ ఆర్ ఎం ఓ రేవతి డి సి హెచ్ ఎస్ శివదయాల్, ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా హెచ్ ఓ డి జనరల్ మెడిసిన్ డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ రాజేశ్వరి , మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ పావని, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు. బోస్ రాజశేఖర్ , బోని, కౌన్సిలర్ విశ్వం లతో కలిసి ఆసుపత్రుల అభివృద్ధి సంఘం సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి పనులకు గాను అవసరమైన బడ్జెట్ కేటాయింపు కొరకు ప్రతిపాదించడం జరిగిందని, ఇందులో భాగంగా ఆసుపత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల కోసం చర్చించడం జరిగింది అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ఆ దిశగా నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఆసుపత్రిలో ప్రజా ప్రయోజనకరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని కలెక్టర్ సందర్శించి, వైద్యాధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

వీపనగండ్ల, జూన్ 9 (జనం సాక్షి) : 99 రోజులు ప్రణాళిక ముగింపు సందర్భంగా వీపనగండ్ల మండల పరిధిలోని గోపాల్ దీన్నే గ్రామంలో రైతు వేదిక దగ్గర ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ దొడ్ల కవిత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు హాజరై మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని అన్నారు.చెత్తను నాలుగు రకాలుగా విడదీసి చెప్తా డాక్టర్లు వేయాలని, మురుకు నీరు ఇంటి దగ్గరలో నిల్వ ఉండకుండా చూసుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందనితెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు కల్పిస్తుంది వాటిని సద్వినిగం చేసుకోవాలని కోరారు.వానాకాలంలో కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని,వర్షం వస్తే ఇల్లు కూలిపోయే అవకాశం ఉంటే ప్రభుత్వానికి తెలియచేయాలని, వివిధ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత మాట్లాడుతూ ప్రతి ఇంటిదగ్గర ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, మురుగు నీరు రోడ్ల పైన నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పింఛన్లు,సంక్షేమ పథకాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామ కార్యదర్శి కర్ణాకర్, ఏఎస్ఐ వెంకట్ రెడ్డి, లైన్మెన్ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఏఈఓ నరేష్, ఈజీఎస్టీఏ గంగాధర్, సిసి కాశీనాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.బాల్ రెడ్డి, వార్డు సభ్యులు కురుమయ్య,నరేష్,లలితమ్మ,చంద్రయ్య,మహిళా సంఘ సభ్యులు,అంగన్వాడి, ఆశ కార్యకర్తలు,గ్రామ రైతులు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్పై ఓటర్లకు అవగాహన అవసరం

- అన్నదాతలు నానో యూరియాపై దృష్టి సారించాలి
- ఫార్మర్ రిజిస్ట్రీతో అర్హులైన రైతులందరికీ సంక్షేమ పథకాలు
- ప్రజలు పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత ఇవ్వాలి
- గ్రామసభలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, జూన్ 8 (జనం సాక్షి) : ఓటరు జాబితాలో తప్పిదాలు లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ఉద్దేశించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ప్రతి ఓటరుకు అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ, వార్డ్ సభల్లో సోమవారం మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రధానంగా గ్రామసభల్లో తెలియజేయడం జరుగుతుందన్నారు.

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం స్పెషల్ డ్రైవ్ తో ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించడం జరుగుతుందన్నారు. రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలని, సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చన్నారు. ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల ప్రకారం పంటలు సాగు చేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ తో అర్హులైన రైతులందరికీ వ్యవసాయ సంబంధ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. బిపి, షుగర్, తదితర వ్యాధులు ఉన్న గ్రామస్తులు ప్రభుత్వ వైద్యశాలలు అందించే చికిత్సను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత నివ్వాలని, గృహ సంబంధ, ఇతర వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తకుండీలను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు గ్రామంలో పిచ్చికుక్కల బెడదను నిర్మూలించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పలువురు గ్రామస్తులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కూరగాయల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. అంతకుముందు స్వచ్ఛ గ్రామ పంచాయతీ, స్వచ్ఛ తెలంగాణ ఆవశ్యకతపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గ్రామ సర్పంచ్ హరిశ్చంద్రా రెడ్డి, ఉప సర్పంచ్ సీతారాముడు తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, ఎంపీడీవో రాఘవ, ఎస్సై తరుణ్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి సందీప్, ఏఈఓ నరసింహ, పంచాయతీ కార్యదర్శి అరుణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

నిజాంపేట, జూన్ 8 (జనం సాక్షి) : గ్రామస్తుల సహకారం తోనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని, ఎంపీడీవో రాజీరెడ్డి అన్నారు. నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో శనివారం ఉపసర్పంచ్ కుమార్, కార్యదర్శి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు.. ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై వివిధ సూచనలు చేశారు. ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటిని సంరక్షించుకోవాలన్నారు. అలాగే పారిశుధ్యం పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎఈ బిక్షపతి, ఎపీఎం అశోక్, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, కానిస్టేబుల్ నవీన్, గ్రామస్తులు పాతూరి బాల్ రెడ్డి, భూపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

నీట్-2026 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

□ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ ప్రతినిధి, జూన్ 8 (జనంసాక్షి) : ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్-2026 ప్రవేశ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన పరీక్ష అని, అందువల్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తగిన బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్, నోడల్ అధికారి బిక్షపతి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఈడీఎం శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు వారంలో పరిష్కారం

□ డీఆర్ఓ వసంత కుమారి

□ ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి వచ్చే సోమవారం వరకు పరిష్కరించాలి. పరిష్కారంలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు అని డీఆర్ఓ వసంత కుమారి స్పష్టం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి 75 దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుదారునికి రశీదు అందజేసి, సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. దరఖాస్తు పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి

□ జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి) : ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 64 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 20, పెన్షన్లకు 17, ఇతర శాఖలకు సంబంధించినవి 27 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ, ఎం సంపత్ రావు, డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిసహకరించాలి

□ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ బ్యూరో, జూన్8 (జనంసాక్షి) : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బస్తా కూడా మిగలకుండా రవాణా పూర్తి చేయాలి

□ కలెక్టర్ భవేష్ మిశ్రా

ఖానాపూర్ జూన్ 08 (జనం సాక్షి) : కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం బస్తా కూడా మిగలకుండా రవాణా పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సోమవారం మండలంలోని మస్కాపూర్, ఖానాపూర్ వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కావలసినన్ని లారీలు అందుబాటులో ఉన్నాయని, కూలీలను అందుబాటులో ఉంచి రవాణా పూర్తి చేయాలని అన్నారు. ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని బస్తా కూడా మిగుల్చకుండా రవాణా పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తాహసిల్దార్ సుజాత రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో గుప్తనిధుల వేటకు చెక్

□ ఎలక్ట్రానిక్ పరికరాలతో అన్వేషణ

□ ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్

□ గుప్తనిధుల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం, (జనంసాక్షి): కోట్లాది రూపాయల గుప్తనిధులు దొరుకుతాయనే గంపెడాశతో కాళేశ్వరం దట్టమైన అటవీ ప్రాంతంలో గత ఆరు నెలలుగా రహస్యంగా అన్వేషణ సాగిస్తున్న ఇద్దరు వ్యక్తుల ఆటకు సీసీఎస్ పోలీసులు చెక్ పెట్టారు. ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలతో గుప్తనిధుల వేట సాగిస్తున్న ఆదిలాబాద్, హనుమకొండకు చెందిన ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కు అందిన పక్కా సమాచారం మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కాళేశ్వరం అటవీ ప్రాంతంలో మెరుపు తనిఖీలు చేపట్టింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు గుట్టు రట్టయింది.

ఆరు నెలలుగా ఆపరేషన్..

విచారణలో నిందితులు సంచలన విషయాలు వెల్లడించారు. పాత తరం కథలను నమ్మి, కాళేశ్వరం పరిసర అటవీ ప్రాంతంలో నిధులు ఉన్నాయనే భ్రమతో గత ఆరు నెలలుగా అన్వేషిస్తున్నట్లు అంగీకరించారు. ఇందుకోసం విదేశాల నుంచి తెప్పించిన అత్యాధునిక ఎలక్ట్రానిక్ డిటెక్టర్లు, జీపీఎస్ పరికరాలను వినియోగిస్తున్నట్లు తేలింది.

ఇద్దరు నిందితుల అరెస్ట్..

కాళేశ్వరం అడవుల్లో గుప్త నిధుల కోసం అన్వేషణ చేపట్టిన ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఇంజారపు వెంకటరమణ ప్రసాద్, హనుమకొండ జిల్లా కేంద్రంలోని సుధానగర్ కు చెందిన వలబోజు శ్రీనివాస్ లు గుప్త నిధుల కోసం అన్వేషణ చేపట్టిన విషయాన్ని గ్రహించి, నిధుల అన్వేషణకు ఉపయోగించే మెటల్ డిటెక్టర్లు, స్కానర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

జిల్లా ఎస్పీ సంకీర్త్ హెచ్చరిక..

గుప్తనిధుల పేరుతో అమాయకులను మోసం చేసేందుకు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేందుకు కొందరు యత్నిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో ఇలాంటి అన్వేషణలు పూర్తిగా చట్టవిరుద్ధం. ఇలాంటి వారిపై పీడీ యాక్ట్ సహా కఠిన చర్యలు తప్పవు అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి మోసాలను నమ్మవద్దని, అనుమానితుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. కాళేశ్వరం పుణ్యక్షేత్రం చుట్టుపక్కల గుప్తనిధులు ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో కొంతకాలంగా కొందరు రహస్యంగా అన్వేషణ సాగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. దీంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని ఎస్పీ వెల్లడించారు.

ప్రతి ఒక్కరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం స్వీకరించాలి

□ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

□ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ బ్యూరో,జూన్ 08(జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సత్వరమే పరిష్కార మార్గాలను చూపాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్ మరియు (ఇంచార్జ్) పురుషోత్తం పర్యవేక్షణలో, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 170 దరఖాస్తులు వచ్చాయి. మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బాత్‌రూమ్‌లకు తాళాలు వేసి ఉంచడం వల్ల, చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పక్కనే ఉన్న సందులలో మూత్ర విసర్జన చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి, దుర్వాసనతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

నేడు పల్లగుట్టకు రానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

□ సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

స్టేషన్ ఘన్పూర్, జూన్ 08 (జనంసాక్షి) : నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యు త్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో చిల్పూరు మండలం లోని పల్లగుట్ట గ్రామంలో ఏర్పాటుచేస్తున్న సభ స్థలంవద్ద చేయా ల్సిన ఏర్పాట్లను విద్యుత్ శాఖ అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పరిశీలించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లో 60.62కోట్ల విలువైన 7 విద్యుత్ సబ్ స్టేషన్లకు ఉపముఖ్యమంత్రి,విద్యుత్ శాఖ మంత్రి ప్రారంభో త్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న సందర్భం గా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధి కారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి , కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ కులంకుశంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల అనంతరం సుమారు 6వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 6వేల మంది తో నిర్వహించనున్న సభకు సంబందించిన స్టేజ్ పైన, సభా ప్రాంగణంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. 60.62కోట్ల విలువైన సబ్ స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి మొట్ట మొదటి సారి స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గానికి వస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కి ఘనంగా స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. ఒకే రోజు ఒకే చోట 7సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం,శంకు స్థాపనలు జరుగుతున్న సందర్భంగా నియోజకవ ర్గ రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్ కిరణ్ ప్రకాష్, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, విద్యుత్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయ కులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటి లభ్యతలో పండే పంటలను సాగు చేయాలి

□ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నెక్కొండ, జూన్ 8(జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నెక్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జూన్ మొదటి లేదా మూడో వారంలో వర్షాలు కురిస్తే వరితో పాటు అంతర్ పంటలను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేయాలని, జూలైలో వర్షాలు ప్రారంభమైతే తక్కువ నీటి అవసరం ఉన్న కందులు, మినుములు, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. పంట దిగుబడులు పెంచుకోవాలనే ఉద్దేశంతో అధిక రసాయన ఎరువులు, పురుగుమందులు వాడరాదని కలెక్టర్ హెచ్చరించారు. రసాయనాల అధిక వినియోగం వల్ల మానవ ఆరోగ్యానికి ముప్పు ఏర్పడటమే కాకుండా నేల సారవంతత కూడా దెబ్బతింటుందని చెప్పారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, తడి చెత్త, పొడి చెత్త, బయో వేస్ట్, సానిటరీ వేస్ట్‌లను వేర్వేరుగా సేకరించి రీసైక్లింగ్‌కు సహకరించాలని సూచించారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మరియు జనాభా లెక్కల కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు. సరైన ధ్రువపత్రాలతో అధికారులకు సహకరించడం ద్వారా ఓటు హక్కు పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఆడపిల్లల విద్యకు కుటుంబాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని స్వతంత్రంగా ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యంతో పాటు కుటుంబాభివృద్ధిపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంటూ తల్లిదండ్రులు అలాంటి వాటిని నిరోధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి ఎంపీడీవో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ సంబంధిత అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

కుబీర్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లు ప్రారంభం

□ రైతులు ఆందోళన చెందవద్దు.. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం: ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్

కుబీర్, జూన్ 08 (జనంసాక్షి) : కుబీర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జొన్న కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. ఐకెపి ఆధ్వర్యంలో చేపట్టే ఈ కొనుగోళ్లకు తొలిరోజే రైతులు పెద్ద సంఖ్యలో జొన్న లోడుతో తరలిరావడంతో మార్కెట్ యార్డు ఆవరణ వాహనాలతో సందడిగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. మార్కెట్‌లో మొక్కజొన్న నిలువలు ఎక్కువగా ఉండటం వల్లే జొన్న టోకెన్ల పంపిణీలో కొంత జాప్యం జరిగిందని, దీన్ని రైతులు గమనించాలని కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ పంటను మార్కెట్‌కు తెచ్చే సమయంలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు సూచించారు. తేమ శాతం లేకుండా చూసుకోవాలని, తద్వారా మద్దతు ధరను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని కోరారు.

కలెక్టర్ గారు.. జక్కలుద్ది ప్రజల బాధలు తీర్చండి

వరంగల్ ఈస్ట్, జూన్ 08 (జనం సాక్షి) : వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ మండలం 43 డివిజన్ జక్కలొద్ది గ్రామ ప్రజలు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ లో తమ బాధలకు సంబంధించిన వినతి పత్రాన్ని సమర్పించారు. తమ ఊరికి దగ్గరలో మధ్యలో కుంట ఆయకట్టు దాదాపు 18 నుంచి 20 ఎకరాలు విస్తీర్ణం ఉంటుందని దానిలోకి వెస్టన్ చెరువు నీళ్లు బంధం చెరువు నీళ్లు వస్తాయని ఈ నీళ్లు రావడం వలన మధ్యలో కుంట మత్తడి నీళ్లు ఎక్కువగా వస్తుండడంతో గతంలో వాగు ద్వారా నీళ్లు బయటికి పోయేవని, కానీ ప్రస్తుతం వాగుకు గడ్డంగా కొందరు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయడం వల్ల నీళ్లు బయటికి పోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో వరదనీటి ఉధృతి పెరిగి జొక్కలోది సమీపంలో ఉన్నటువంటి వాగు పొంగి పొర్లి ఇళ్లల్లోకి వస్తున్నాయని ఈ సమస్యకు పరిష్కారానికి ప్రధానంగా జక్కలుద్ది గ్రామానికి వెళ్లే కల్వర్టు వద్ద ఒక బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను వినతి పత్రం ద్వారా కోరారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

□ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 8, (జనంసాక్షి) : ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ ఎంజీఎం, జూన్ 8(జనంసాక్షి): కాకతీయ మెడికల్ కళాశాల(కే ఎం సి)లో గల వాటర్ ట్యాంక్ వాల్వ్ కు మరమ్మత్తు పనులు కొనసాగుతున్నందున నేడు (మంగళ వారం) నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈ ఈ రవి కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భం గా ఇట్టి ట్యాంక్ పరిధి లోని రంగం పేట, దత్త క్షేత్రం, పోతన నగర్, రాజీవ్ కాలనీ, పాపయ్య పేట చమాన్, మున్సిపల్ క్వార్టర్స్ ,కృష్ణ మందిర్ వెనకాల, భద్రకాళి రోడ్డు ములుగు రోడ్డు, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో మంగళ వారం నీటి సరఫరా జరగదని, కాలనీ వాసులు ఈ విషయాన్ని గమనించి బల్దియా కు సహకరించాలని ఈ ఈ కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
09 జూన్ 2026

గ్రామ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 8 (జనం సాక్షి) : భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్‌తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా

ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. పేదల్లో అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూలి మండల ఉపకేంద్ర స్థాయి లో పశు వైద్యశాల భవనం వి.వి.పాలెంలో నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా పశు వైద్యశాలకు పరిసర ఐదు, ఆరు జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, కొన్ని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు అవసరమని తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు భూమి వినియోగం సమర్థవంతంగా ఉండాలని సూచించారు. పాఠశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాల్లో లేదా వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి

బూర్గంపహాడ్, జూన్ 8 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలానికి మారుమూలన ఉన్న కృష్ణసాగర్ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ తాటి వాణి ఉపసర్పంచ్ భూక్యా మోహనరావుతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అంకిత్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కృష్ణసాగర్ పంచాయతీలో అభివృద్ధి పనులు మంజూరు చేయించాలని, ప్రధానంగా తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్ సమస్యలపై అధికారులతో చర్చించి ప్రజాసమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ సభ విజయవంతం

శంషాబాద్, జూన్ 8 (జనంసాక్షి) : శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామ పంచాయతీలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య మెరుగుదల, తాగునీటి సదుపాయాల కల్పన, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలమాకుల గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సభలో సర్పంచ్ కటుకూరి కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, 'జల సంరక్షణ వన సంరక్షణ', వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరదల నిర్వహణ, భద్రత తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఎంపీఓ రమేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. వర్షాకాల సన్నద్ధత, పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వన మహోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమర్ లింగం గౌడ్, ఉప సర్పంచ్ గూడెపు కుమార్, వార్డు సభ్యులు, శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దండు ఇస్తరీ, నాయకులు చంద్రారెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ సమాచారంలో చేతివాటం..?

● పోచంపల్లి ప్రైమరీ స్కూల్ బిల్లులపై అనుమానాలు!
● నెలరోజులు దాటినా సమాచారమివ్వని హెచ్ఎం
● డీఈఓ ఆదేశాలతో వచ్చిన పత్రాలపై దరఖాస్తుదారు అసంతృప్తి
● ప్రభుత్వ నిధులపై పారదర్శకత ఎక్కడంటూ ప్రశ్నలు



భూదాన్ పోచంపల్లి, జూన్ 8 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నిధుల వినియోగానికి సంబంధించిన సమాచార హక్కు చట్టం వివరాల అందజేతలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించడమే కాకుండా, అనుమానాస్పద పత్రాలను అందజేశారని దరఖాస్తుదారు బొమ్మ మాలతి ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత లోపించిందనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమె మండిపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... పోచంపల్లి ప్రైమరీ స్కూల్‌కు సంబంధించిన వివిధ రకాల గ్రాంట్లు, ఆడిట్ రిపోర్ట్స్, మిడ్ డే మిల్స్ వివరాలు, కంప్లీషన్ సర్టిఫికెట్లు, టీచర్స్ అటెండెన్స్, టీచింగ్ వివరాలు, స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్, పీటీఎమ్ మినిట్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ మరియు నిధుల ఖర్చుల పూర్తి వివరాలను కోరుతూ బొమ్మ మాలతి మార్చి 13న ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, చట్టప్రకారం నెల రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్లక్ష్యంతో సమాచారం ఇవ్వలేదు. నెల రోజులు గడిచినా సమాచారం రాకపోవడంతో, బాధితురాలు ఏప్రిల్ 27న జిల్లా విద్యాధికారికి మొదటి అప్పీల్ చేశారు. స్పందించిన డీఈఓ ఆదేశాల మేరకు.. ఎట్టకేలకు మే 22న ఎంఈఓ కార్యాలయం నుంచి సమాచారాన్ని పోస్టు ద్వారా దరఖాస్తుదారుకు పంపించారు. అధికారులు పంపిన పత్రాలను పరిశీలించిన మాలతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అందులోని బిల్లులు సాధారణ అధికారిక బిల్లుల మాదిరిగా లేవని, వాటిపై స్పష్టత లేదని ఆమె పేర్కొన్నారు. "ఇవి అసలు ప్రభుత్వ బిల్లులేనా..? లేక సమాచారం దాచడానికి వేరే విధంగా రూపొందించిన పత్రాలా..?" అని ఆమె అధికారులను నిలదీశారు. ప్రభుత్వ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఆర్‌టీఐ ద్వారా సమాచారం కోరినప్పుడు పూర్తి వివరాలతో కూడిన పారదర్శక పత్రాలను మాత్రమే అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలను నిగ్గుతేల్చాలని కోరారు.

నాపై కావాలనే ఆరోపణలు

దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని నిబంధనల ప్రకారమే పూర్తిగా అందించాను. నేను అందించిన సమాచారంలో ఎలాంటి అవకతవకలు లేవు. గత 18 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. నా సర్వీసులో ఇప్పటివరకు ఎటువంటి రిమార్కులు లేవు. కావాలనే కొందరు వ్యక్తులు నాపై ఆరోపణలు చేస్తున్నారు

పోచంపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పుష్పలత

దమ్మపేటలో వీధి కుక్కల బీభత్సం

● బెంబేలెత్తిపోతున్న గ్రామస్తులు

దమ్మపేట, జూన్ 8 (జనం సాక్షి) : దమ్మపేట మండల వ్యాప్తంగా వీధి కుక్కలు బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు చిన్నారులను,వృద్ధులను అతి భయానకానికి గురిచేస్తున్నాయి.ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే వారిపై,పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై కుక్కలు వెంబడిస్తున్న వైనం రోజురోజుకు పెరిగిపోతుంది. ద్విచక్ర వాహనదారుల సైతం అకస్మాత్తుగా వెంబడించడం వల్ల చిన్నపాటి ప్రమాదాలకు గురవుతున్నారు.వీధి కుక్కలు ప్రజలపై మండల వ్యాప్తంగా సుమారుగా 40 మందిపై దాడి చేసిన వైనం కేవలం ఈ పది రోజుల్లో జరిగింది.స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల జూన్ నెలలో కుక్క కాటుకు గురైన కేసుల సంఖ్య సుమారుగా 40 పైనే ఉండటం మండల వ్యాప్తంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీలోని పంచాయతీ సర్పంచులు గ్రామ సభలో వీధి కుక్కల గురించి ప్రస్తావించకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.ఇప్పటికైనా పంచాయితీ అధికారులు, మండలాధికారులు,జిల్లా అధికారులు కుక్కలకు స్టెరిలైజేషన్(వంధ్యీకరణ చేయించి కుక్కల బెడద నుంచి గ్రామస్తులకు విముక్తి కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త లంకపల్లి రైల్వే బ్రిడ్జిపై అదుపుతప్పి పల్టీ కొట్టిన ప్రైవేటు బస్సు

● అర్ధరాత్రి సమయంలో రైల్వే బ్రిడ్జిని బలంగా ఢీ కొట్టిన బస్సు
● మద్యం మత్తులో బస్సు నడిపిన డ్రైవర్
● మద్యం మత్తు, నిర్లక్ష్యమే కారణం అంటున్న ప్రయాణికులు తప్పిన పెనుప్రమాదం

పెనుబల్లి, జూన్ 8 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి రైల్వే బ్రిడ్జిపై ఆదివారం రాత్రి ప్రయాణికులతో అతివేగంగా వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల బ్రిడ్జిని ఢీ కొట్టడంతొ పెను ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదానికి బస్సు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు తీవ్ర గాయాలు పాలు కాగా మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో సుమారు 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదే ప్రమాదంలో బస్సు బ్రిడ్జి పై నుండి రైల్వే ట్రాక్ పై పడితే ఊహించని ప్రమాదం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు. వివరాలకు వేంసూరు మండలం కందుకూరుకు చెందిన కె.వి.ఆర్ ట్రావెల్స్ బస్సు ఎన్టీఆర్ జిల్లా చెక్కపల్లి నుండి సత్తుపల్లి మీదుగా హైదరాబాద్ వెళుతూ మార్గమధ్యలో కొత్తలంక పల్లి రైల్వే బ్రిడ్జిపై బస్సు ప్రమాదం సంభవించింది. బస్సు డ్రైవర్ మద్యశీ మత్తులో నిర్లక్ష్యంగా ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టెక్ చేస్తూ రైల్వే బ్రిడ్జిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో వేగంగా వెళుతున్న బస్సు పల్టీ కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది . సమాచారం అందుకున్న వి ఎం బంజర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో బస్సులో ఉన్న ప్రయాణికులను బయటకు తీశారు. గాయాల పాలైన ప్రయాణికులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం సేవించి బస్సు నిర్లక్ష్యంగా నడపడమే ప్రమాదానికి కారణమని బస్సులో ప్రయాణికులు తెలిపారు. ధనార్జనే ధ్యేయంగా ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ బస్సుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు

● జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరిక

దేవరకొండ, జూన్ 8 (జనం సాక్షి) : ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వినూత్నంగా ఆలోచించారు.సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలు విని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు.అయితే క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యల సత్వర పరిష్కారం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్ 30 న, జి ఓ 3 ద్వారా డివిజన్ స్థాయిలో కూడా జిల్లా స్థాయిలో మాదిరిగానే తప్పనిసరిగా ప్రజావాణిని నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు నల్గొండ జిల్లాలోని నల్గొండ,దేవరకొండ,మిర్యాలగూడ,చండూరు డివిజన్లలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నది.అయితే చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా పిర్యాదుదారులు చందం పేట,నెరేడుగొమ్ము లాంటి సుదూర ప్రాంతాలనుండి వ్యయ ప్రయాసాలకోర్చి నల్గొండకు రావడం గమనించిన జిల్లా కలెక్టర్ తానే డివిజన్ స్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు విని పరిష్కరించాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలోనే సోమవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజలవద్దనుండి ఫిర్యాదులు స్వీకరించారు. దేవరకొండ ఆర్ డి ఓ పి. పద్మప్రియ, డిఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.

పూసలపాడు ఫోర్జరీ బండారం గంటల్లోనే...

● సర్పంచ్ యూ-టర్న్
● తెరవెనుక నడిచిన సెటిల్మెంట్ భాగోతం?!
● రూ. 85,762 నిధుల దారిమళ్లింపుపై శనివారం ఫిర్యాదు..అంతలోనే విత్‌డ్రా!
● మాజీ సర్పంచ్ అకౌంట్‌కు డబ్బులు వెళ్లినట్లు తేలినా ప్రస్తుత సర్పంచ్ వెనకడుగు!
● రాజకీయ ఒత్తిళ్లా..? డబ్బుల పంపకాల ఒప్పందమా..?
● మండలంలో గుసగుసలు..

మాడుగులపల్లి, జూన్ 8 (జనం సాక్షి) : మండల పరిధిలోని పూసలపాడు గ్రామ పంచాయతీలో ప్రభుత్వ సొమ్ము లూటీ వ్యవహారం గంటల వ్యవధిలోనే తీవ్ర మలుపులు తిరుగుతూ హైడ్రామా ను తలపిస్తోంది ఏకంగా గ్రామ ప్రథమ పౌరుడి సంతకాన్నే ఫోర్జరీ చేసి రూ. 85,762 పంచాయతీ నిధులను నొక్కేసిన ఉదంతంలో శనివారం రోజు ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన ప్రస్తుత సర్పంచ్, అంతలోనే యూ-టర్న్ తీసుకోవడం మండలవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన వ్యవహారంలో గంటల వ్యవధిలోనే ఫిర్యాదును రిటర్న్ తీసుకోవడం వెనుక పెద్ద ఎత్తున తెరవెనుక నల్లధన రాజకీయం నడిచిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మాజీ బండారం బయటపడటంతోనేనా..?

గ్రామ పంచాయతీ ఖాతా నుండి తన ప్రమేయం లేకుండానే నిధులు మాయమవ్వడంపై ప్రస్తుత సర్పంచ్ శనివారం నాడు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు దీంతో రంగంలోకి దిగిన అధికారులు బ్యాంక్ లావాదేవీలను జల్లెడ పట్టగా షాకింగ్ నిజాలు బయటపడ్డాయి గత ఏప్రిల్ 20, 2026 న ఈ నిధులన్నీ అదే గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలోకి నేరుగా బదిలీ అయినట్లు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది అధికారులు నిబంధనల ప్రకారం ఫైల్‌ను ఉన్నతాధికారులకు కూడా ఫార్వర్డ్ చేశారు. అయితే, సూత్రధారి ఎవరో తేలగానే సీన్ మొత్తం మారిపోయింది.

రాజకీయ ఒత్తిళ్లా..? డబ్బుల పంపకాల సర్దుబాటా..?

అక్రమంగా ప్రభుత్వ నిధులు డ్రా అయ్యాయని, ఫోర్జరీ జరిగిందని స్వయంగా ఫిర్యాదు చేసిన సర్పంచ్ గంటల వ్యవధిలోనే ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నట్లు ఎంపీడీఓకు మరో దరఖాస్తు ఇవ్వడం వెనుక ఉన్న అసలు రంగు ఏమిటని పూసలపాడు గ్రామస్థులు ముక్కున వేలేసుకుంటున్నారు ప్రస్తుతం మండలంలో దీనిపై రెండు ప్రధాన కోణాల్లో చర్చలు సాగుతున్నాయి

ఫోర్జరీకి పాల్పడిన సదరు మాజీ సర్పంచ్‌ను కాపాడేందుకు నియోజకవర్గ స్థాయికి చెందిన బలమైన రాజకీయ శక్తులు రంగంలోకి దిగాయా? సర్పంచ్‌ను బెదిరించి లేదా ఒత్తిడి తెచ్చి ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా చేశాయా..?

ఆర్థిక ఒప్పందాలు (సెటిల్మెంట్) లేదా దొరికితే దొంగ దొరక్కపోతే దొర' అన్న చందంగా ఇద్దరు సర్పంచ్‌ల మధ్య (మాజీ, ప్రస్తుత) అర్ధరాత్రి వేళ రకస్యంగా డబ్బుల పంపకాలు జరిగాయా? అక్రమ నిధుల్లో ఇద్దరికీ వాటాలు కుదరడం వల్లే ఈ ఫిర్యాదు ఉపసంహరణ డ్రామా ఆడి దొంగలను కాపాడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సర్పంచ్ వెనక్కి తగ్గినా చట్టం ఊరుకుంటుందా..?

ఇక్కడ విస్తుపోయే విషయమేమిటంటే సర్పంచ్ వ్యక్తిగతంగా ఫిర్యాదు వెనక్కి తీసుకున్నంత మాత్రాన, ప్రభుత్వ నిధుల లూటీ, సంతకాల ఫోర్జరీ లాంటి తీవ్రమైన క్రిమినల్ నేరాలు చెల్లాచేదురైపోతాయా? అని మేధావులు ప్రశ్నిస్తున్నారు ఇది ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత గొడవ కాదు ప్రజాధనాన్ని కాజేసిన ఉదంతం. సర్పంచ్ లొంగిపోయినా, ఉన్నతాధికారులు మాత్రం లొంగకూడదని పూసలపాడు పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపి, ఫోర్జరీకి పాల్పడిన మాజీ సర్పంచ్‌తో పాటు, దీనికి సహకరించిన సూత్రధారులందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్థులు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరిస్తాం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 8 (జనం సాక్షి) : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలోభాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 14 క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 15 డివిజన్లకు సంబంధించి చివరి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, సుమారు 3,500 దరఖాస్తులకు పైగా వచ్చాయని తెలిపారు. చివరి దరఖాస్తు స్వీకరించే వరకు తాను స్వయంగా ఇక్కడే ఉండి ప్రజల వినతులు స్వీకరిస్తానని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాన ప్రాధాన్యంతో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డి.ఎఫ్.ఓ. అనూజ్ అగర్వాల్, ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మెన్ నవీన్, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

భారీ నష్టాల్లో సూచీలు

సెన్సెక్స్ 719, నిఫ్టీ 244 పాయింట్లు డౌన్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడం, చమురు ధరలు పెరగడం, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న అంచనాలు ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్‌నూ పడేశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల నష్టపోగా.. మధ్యలో కోలుకున్నట్లు కనిపించింది. ఆఖరిలో మళ్లీ అమ్మకాల ఒత్తిడితో 700 పాయింట్ల నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 73,421.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,243.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కదలాడింది. ఇంట్రాడేలో 73,318.94 – 73,934.35 మధ్య చలించిన సూచీ.. చివరికి 719.08 పాయింట్ల నష్టంతో 73,524.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 243.70 పాయింట్ల నష్టంతో 23,123 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్, ఇండిగో, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4290 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

పశ్చిమాసియాలో ఇరాన్– ఇజ్రాయెల్ పరస్పర దాడులు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్‌లూ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మరోసారి ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. 93 డాలర్ల వద్ద ట్రేడవుతున్న క్రూడాయిల్ 96 డాలర్ల స్థాయికి చేరడం మన మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

'టెక్ స్టాక్స్ అమ్మకాల్లో ఉంటే కొనుక్కోండి.. ఇదే మంచి సమయం': హువాంగ్

కృత్రిమ మేధ రంగంలో ప్రస్తుత షేర్ల పతనం వాస్తవానికి మంచి వార్తేనని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ అంటున్నారు ఏఐ నిర్మాణం ఇప్పుడే మొదలైందని, టెక్‌స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిలో ఉన్నప్పుడే కొనుగోలుకు మంచి సమయం అని వ్యాఖ్యానించారు. ఎన్విడియా సహా పలు చిప్ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూస్తోన్న సమయంలో హువాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమమేధ (ఏఐ) సంస్థల విలువలపై మదుపర్లకు సందేహాలు ఏర్పడటం, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను పెంచొచ్చన్న ఆందోళనలు ఈ నష్టాలకు దారితీశాయి. ఏఐ పెట్టుబడులను మదుపర్లు భారీగా వెనక్కి తీసుకోవడంతో దక్షిణకొరియా సూచీ కొస్పి పతనమైంది. ఈ షేర్ల అమ్మకాలను ఎలా చూడాలంటూ ఆ దేశంలోనే ఉన్న హువాంగ్‌కు ప్రశ్న ఎదురైంది. "కృత్రిమ మేధ మొదలైంది ఇప్పుడే. ఇప్పుడు మీరు డిస్కౌంట్‌లో స్టాక్స్ కొనుగోలు చేయడానికి మంచి సమయం. ఉత్సాహంగా ఉండాలి. ఇంటర్నెట్ ఎలాగైతే ఇప్పుడు ప్రజల జీవితాల్లో అత్యంత కీలకంగా ఉందో.. ఏఐ కూడా అలాగే మారడం ఖాయం" అని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఏఐ పలు రంగాల్లోకి విస్తృత మార్పులు తీసుకువస్తుందని, ప్రజల జీవన విధానాన్ని మారుస్తుందని హువాంగ్ విశ్వసిస్తున్నారు. ఆ ఏఐ సర్వీసుల్ని అందించాలంటే డేటా సెంటర్లు, చిప్స్ కీలకం. ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో డేటా సెంటర్లకు అత్యాధునిక చిప్‌లను అందిస్తూ ఎన్విడియా ప్రపంచంలోనే అగ్రగామి సంస్థగా కొనసాగుతోంది.

ఏఐ ఖర్చు.. కంపెనీలకే తెలియట్లేదట..!

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కొంతకాలంగా వినిపిస్తోన్న పదం కృత్రిమ మేధ ఉత్పాదకతను పెంచుకునే లక్ష్యంతో రోజూవారీ కార్యకలాపాల్లో పలు కంపెనీలు ఏఐ వినియోగం వైపు మొగ్గుచూపుతున్నాయి. అయితే ఆ సంస్థలకు ఖర్చు తడిసిమోపెడవుతోంది. తమ మీద పడుతోన్న ఆ భారాన్ని ఇటీవల కాలంలో గుర్తిస్తోన్న కంపెనీలు.. ఏఐ వినియోగంపై పరిమితులు విధిస్తున్నాయి. ఏఐ బిల్లు ఎలా ఛార్జ్ చేస్తున్నారో కూడా కంపెనీలకే అవగాహన లేదని కేపీఎంజీ సర్వే వెల్లడించింది. కేపీఎంజీ.. టెక్ అంశాలపై విస్తృతంగా సర్వేలు చేపడుతుంటుంది. కేవలం 26 కంపెనీలకే ఈ ఏఐ ఖర్చుపై అవగాహన ఉందని ఆ సర్వేలో వెల్లడైంది 22 సంస్థలకు అలాంటి అవగాహన ఏదీ లేదని, 50 శాతం వాటికి మాత్రం కొద్దిమేర స్పష్టత ఉందని పేర్కొంది. "ఇది ఇంతకుముందు వాడుకలో లేని వనరు. దీనిని సరిగా నిర్వహించాల్సిన అవసరం ఉంది" అని కేపీఎంజీ ఏఐ గ్లోబల్ హెడ్ స్టీవ్ చేజ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంత్రోపిక్, ఓపెన్ ఏఐ వంటి ఏఐ ప్రొవైడర్లు టోకెన్ ఆధారిత వినియోగంలోకి మారాయి. ఈ క్రమంలోనే వ్యయంపై చర్చ జరుగుతోంది. కృత్రిమ మేధను ఎంత వినియోగిస్తే.. అన్ని టోకెన్లు ఖర్చవుతాయి. ఏఐ వినియోగానికి టోకెన్లు కొలమానం అన్నమాట. తన ఉద్యోగులు ఏఐ టూల్స్ వాడేందుకు ఒక కంపెనీ లైసెన్స్ కొనుగోలు చేస్తే.. వారికి నిర్దిష్ట పరిమితిలో టోకెన్లు లభిస్తాయి. ఆ పరిమితి దాటితే.. టోకెన్ వాడకాన్ని బట్టి, అదనపు ఛార్జీలు పడతాయి.

ఖర్చులు అధికంగా ఉండటంతో ఉబర్ సంస్థ ఒక సంవత్సరానికి కేటాయించిన ఏఐ బడ్జెట్.. రెండు నెలల్లోనే ఖర్చయిందని తెలుస్తోంది. దాంతో ఆ కంపెనీ ఉద్యోగులందరికీ ఏఐ వాడకంపై 1500 డాలర్ల పరిమితి విధించినట్లు సమాచారం. మరో కంపెనీ క్లాడ్ కోసం ఒక్క నెలలోనే సుమారు 500 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఇంతవరకు రాబడిపై ఎలాంటి స్పష్టత లేకపోయినా, పలు టెక్ సంస్థలు ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతోన్న తరుణంలో.. ఈ వ్యయాలపై చర్చ జరుగుతోంది.

మార్కెట్లను కమ్మిన యుద్ధభయాలు..

దేశీయ మార్కెట్లను యుద్ధభయాలు కమ్మాయి. దాంతో సోమవారం సూచీలు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి సెన్సెక్స్ 800 పాయింట్ల మేర కుంగింది. ఉదయం 9.33 గంటల సమయంలో సెన్సెక్స్ 675 పాయింట్లు కోల్పోయి, 73,567 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 215 పాయింట్ల నష్టంతో 23,150 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.35గా ఉంది. నిఫ్టీ సూచీలో సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అపోలో హాస్పిటల్స్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే షేర్లు లాభాల్లో ఉన్నాయి. విప్రో, టీసీఎస్, ఎంఅండ్ఎం, హిందాల్కో, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు నష్టాల్లో ఉన్నాయి. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఏప్రిల్ 8 తర్వాత మరోసారి తీవ్రస్థాయి ఘర్షణలు మొదలయ్యాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇరాన్ ప్రతిదాడులు మొదలుపెట్టింది. శాంతి ఒప్పందానికి తాము చాలా దగ్గరగా ఉన్నామని ఇలాంటి సమయంలో దాడులు వద్దని ట్రంప్ చెప్తున్నా.. ఇజ్రాయెల్ పట్టించుకోవట్లేదని తెలుస్తోంది. ఈ ఘర్షణలతో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. ఒక బ్యారెల్ ధర మూడు శాతం మేర పెరిగి.. 96 డాలర్ల పైనే ఉంది. ఈ పరిణామాలు నష్టాలకు కారణమవుతున్నాయి.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 5.40	₹ 5.42

బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

₹ 1,45,800 (22 క్యారెట్లు)	₹ 1,59,060 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 2,95,000

సెబీ సరిగా గుర్తించలేకపోయింది

15 రోజుల్లో మళ్లీ పత్రాలు అందజేస్తాం:రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్

దిల్లీ: మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ఇప్పటికే 300-400 గిగాబైట్ల(జీబీ) మేర పత్రాలను సమర్పించామని బంగారం శుద్ధి, ఆభరణాల ఎగుమతి సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ఆదివారం తెలిపింది. అయితే సరైన ఫైళ్లను సెబీ గుర్తించలేకపోయిందని భావిస్తున్నామని పేర్కొంది. దీన్ని పరిష్కరించడానికి, సెబీ కోరిన పత్రాలను 15 రోజుల్లోగా తిరిగి సమర్పిస్తామని వెల్లడించింది. 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో రూ.15.15 లక్షల కోట్ల మేర ఆదాయాన్ని పెంచి చూపారని ఆరోపిస్తూ జూన్ 3న సెబీ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుకు ఒక ప్రాథమిక అకౌంటింగ్ లోపమే మూలమని కంపెనీ వ్యవస్థాపకులు, ఛైర్మన్ రాజేశ్ మెహతా వెల్లడించారు. నియంత్రణ సంస్థ కంపెనీ ఎబిటా గణాంకాలను తీసుకుని వాటిని ఆదాయంగా వర్గీకరించడంతోనే లోపం తలెత్తిందని పేర్కొన్నారు. ఎబిటా అంటే స్థూల ఆదాయం కిందకు వస్తుందని, దాన్ని సెబీ ఆదాయంగా వర్గీకరించిందని వివరించారు. పీఎల్ఐ పథకం నుంచి తొలగింపు!: రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ భారీ ఆర్థిక మోసానికి పాల్పడిందని ఆరోపిస్తూ సెబీ గత వారం 109 పేజీల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజ్ కోసం ఉద్దేశించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద లబ్ధిదారుల జాబితా నుంచి ఆ సంస్థను తొలగించే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయంపై భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఐ) త్వరలోనే నిర్ణయం తీసుకోనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కిర్గిజ్‌స్థాన్ అధికారిక పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి దృష్టికి ఈ విషయాన్ని తీసుకురానున్నారు. ఆ తర్వాత తుది నిర్ణయం వెలువడుతుందని మంత్రిత్వ శాఖలోని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

రూపాయికి రిపేరు

ప్రభుత్వ బాండ్లలో విదేశీ పెట్టుబడులకు పన్ను మినహాయింపుతో ఊతం

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సెక్యూరిటీలపై వచ్చే వడ్డీ ఆదాయంతో పాటు, వాటి విక్రయం లేదా బదిలీ ద్వారా వచ్చే మూలధన లాభాలపై విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులకు (ఎఫ్‌పీఐ) పన్ను మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. జూన్ 5న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం, ఆదాయపు పన్ను చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన ఈ పన్ను మినహాయింపులు 2026 ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పార్లమెంట్ సమావేశాలు లేనందున, తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో ఈ ఆర్డినెన్సు తీసుకొచ్చినట్లు పేర్కొంది. దీనికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుతం 12 నెలల కంటే ఎక్కువ కాలం అట్టేపెట్టుకున్న లిస్టెడ్ షేర్లు, బాండ్లపై విదేశీ పెట్టుబడిదారులకు 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వసూలు చేస్తుండగా, ప్రభుత్వ బాండ్లపై వచ్చే వడ్డీపై 20% విత్‌హోల్డింగ్ పన్ను విధిస్తున్నారు.

నిబంధనల్లో సడలింపు

అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్‌ను మార్చాలనే లక్ష్యంలో భాగంగా.. దీర్ఘకాలిక విదేశీ నిధులను ఆకర్షించేందుకు 'ఫుల్లీ యాక్సెసబుల్ రూట్ (ఎఫ్ఏఆర్)' పరిధిని విస్తరించింది. కొత్తగా జారీ చేసే 15, 30, 40 ఏళ్ల కాలపరిమితి కలిగిన ప్రభుత్వ బాండ్లతో పాటు సావరిన్ గ్రీన్ బాండ్లనూ ఇందులో చేర్చింది. జనరల్ రూట్‌లో వచ్చే ఎఫ్‌పీఐ పెట్టుబడులపైనా ఆంక్షలను తొలగించింది. కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల్లో 6%, రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల్లో 2% మొత్తంగా ఉన్న పెట్టుబడి పరిమితులను యథాతథంగా కొనసాగించనుంది. దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం ఉన్న వేర్వేరు పరిమితులనూ ఒకే విధంగా మార్చింది. దీనివల్ల పింఛను ఫండ్లు, బీమా కంపెనీలు, సార్వభౌమ వెల్త్ ఫండ్ల వంటి స్థిరమైన, దీర్ఘకాలిక మూలధన పెట్టుబడులు దేశంలోకి వస్తాయని, తద్వారా విదేశీ మారకపు ద్రవ్య ప్రవాహం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఆర్‌బీఐ సైతం..

పెరిగిన ఇంధన ధరలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనిశ్చితి వాతావరణం నేపథ్యంలో విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు ఆర్‌బీఐ కూడా పలు నిర్ణయాలు ప్రకటించింది. ఎఫ్ఏఆర్ విస్తరణ, ఆంక్షల తొలగింపు వంటి ఆర్థిక శాఖ ప్రకటనలను ఆర్‌బీఐ ఆమోదించింది. ప్రవాస భారతీయులు(ఎన్నారైలు) విదేశీ కరెన్సీలో చేసే డిపాజిట్లకు నిబంధనలను ఆర్‌బీఐ సడలించింది. వీరి నుంచి డాలర్లు ఆకర్షించేందుకు 3-5 ఏళ్ల ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లపై సెప్టెంబరు 30 వరకు హెడ్జింగ్ వ్యయాలను భరించనున్నట్లు తెలిపింది. కేంద్రం, ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాలు దేశీయ డెట్ మార్కెట్లో విదేశీ భాగస్వామ్యాన్ని పెంచేందుకు, తక్కువ వడ్డీరేట్లకే రుణాలు పొందేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు లభిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది 6 శాతానికి పైగా పతనమైన రూపాయి విలువకు కూడా ఈ నిర్ణయాలు అండగా నిలువనున్నాయి.

ఇతర దేశాల వారికీ..

2026-27 బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా, విదేశాల్లో నివసించే వ్యక్తులు (పీఆర్ఓఐ) పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ ద్వారా నమోదిత భారతీయ కంపెనీల ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతి

ఎస్ఏఎఫ్ అభివృద్ధిని వేగవంతం చేయాలి

రియో డి జనీరో (బ్రెజిల్): ప్రస్తుత ఇంధన సంక్షోభం నేపథ్యంలో పర్యావరణ అనుకూలమైన పునరుత్పాదక ఇంధనాలు, ముఖ్యంగా సుస్థిర విమాన ఇంధనం అభివృద్ధిని మరింత వేగవంతం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని విమానయాన సంస్థల సంఘం ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ పేర్కొన్నారు. రియో డి జనీరోలో జరుగుతున్న ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశంలో అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, విమాన ఇంధన ధరల పెరుగుదల, ప్రత్యామ్నాయ పర్యావరణ ఇంధనాల అవసరాలపై కీలక చర్చలు జరిగాయి. 2050 నాటికి సున్నా కర్బన లక్ష్యాన్ని చేరుకుంటామని విమానయాన రంగం ప్రతిజ్ఞ చేసి అయిదేళ్లు గడుస్తున్నా, 2026లో అంతర్జాతీయ ఎస్ఏఎఫ్ ఉత్పత్తి కేవలం 2.4 మిలియన్ టన్నులుగా మాత్రమే ఉంది. ఇది ప్రపంచ విమాన ఇంధన వినియోగంలో కేవలం 0.8 శాతం మాత్రమే. దీని కోసం విమానయాన సంస్థలు 4.3 బిలియన్ డాలర్ల భారీ వ్యయాన్ని భరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎస్ఏఎఫ్ ఉత్పత్తి సామర్థ్యం 9 మిలియన్ టన్నులు ఉన్నప్పటికీ.. ప్రభుత్వ విధానాల కారణంగా కంపెనీలు పునరుత్పాదక డీజిల్ ఉత్పత్తికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని ఐఏటీఏ నెట్ జీరో రీసెర్చ్ హెడ్ ప్రీతి జైన్ విమర్శించారు. చమురు కంపెనీల ఉదాసీనత, ప్రభుత్వ విధానాల వల్ల 2050 నాటికి 65% ఇంధన అవసరాలకు ఎస్ఏఎఫ్ ద్వారా భర్తీ చేయాలనే లక్ష్యం ఏటా కష్టతరంగా మారుతోందని విల్లీ వాల్ష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏటీఎఫ్ ధరల స్థిరీకరణ నిధి భేష్: విమాన ఇంధన ధరల అస్థిరత సమస్యను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం రూ.10000 కోట్ల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం చాలా మంచి నిర్ణయమని ఐఏటీఏ ఎనర్జీ ట్రాన్సిషన్ డైరెక్టర్ హేమంత్ మిస్త్రీ ప్రశంసించారు.

మైక్ కిందపడేసి.. ఇంటర్వ్యూ నుంచి

వెళ్లిపోయిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వ్యవహారశైలితో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బహిరంగంగా తన అసహనాన్ని వ్యక్తంచేసిన ఆయన.. మైక్ తీసి కిందపడేశారు. ఇక చాలు అంటూ బయటకు వెళ్లిపోయారు. మీట్ ది ప్రెస్ ఇంటర్వ్యూలో భాగంగా ఇరాన్ యుద్ధంపై ట్రంప్‌నకు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలు ఎక్కడివరకు వచ్చాయని హోస్ట్ అడిగా రు. అలాగే గత ప్రభు త్వం అన్యాయంగా పలు వురిని లక్ష్యంగా చేసుకుందని ఆరోపిస్తూ.. వారికి పరిహారం ఇచ్చే ఉద్దేశంతో

ప్రతిపాదించిన యాంటీ వెపనైజేషన్ స్కీమ్‌ను గురించి ప్రశ్నించారు. ఈ చర్చ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్, మీడియాపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. అలాగే 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ తాను చేసిన ఆరోపణలను సమర్థించుకున్నారు. అయితే వీటన్నింటికి ఆధారాలు చూపించాలంటూ హోస్ట్ క్రిస్టెన్ వెల్కర్ పదేపదే అడిగారు. దీంతో ట్రంప్ సహనం కోల్పోయారు. "చాలా ఆధారాలున్నాయి. ఆ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. మళ్లీ ఇప్పుడు కాలిఫోర్నియాలో జరుగుతోన్న మేయర్ ఎన్నికల్లోనూ అదే జరుగుతోంది. ఓటింగ్ పూర్తయినా కౌంటింగ్ ఆలస్యమవుతుండటం ఇందుకు నిదర్శనం" అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ వల్ల ఆలస్యమవుతుండొచ్చని హోస్ట్ పేర్కొనగా.. ఆ వాదనను అధ్యక్షుడు తోసిపుచ్చారు. ఆ చర్చ తీవ్రరూపం దాల్చడంతో.."ఇక చాలు ఆపేద్దాం. థ్యాంక్యూ" అంటూ మైక్రోఫోన్‌ను తీసేసి, కిందపడేశారు. ఇంటర్వ్యూను కొనసాగిద్దాం అంటూ హోస్ట్ కోరగా.. ఇప్పటికే చాలా సమయం ఇచ్చానంటూ మధ్యలోనే వెళ్లిపోయారు.

ఇరాన్ పౌరుల కోసం విరాళాలు..

సౌదీలో ఇద్దరు భారతీయుల అరెస్ట్

జనంసాక్షి: ఇరాన్ పౌరులకు సాయం చేయబోయి ఇద్దరు భారతీయ సోదరులు విదేశంలో చిక్కుల్లో పడ్డారు. టెహ్రాన్ ఎంబసీకి విరాళం పంపడంతో వారిని సౌదీ అరేబియాలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాకు చెందిన మహమ్మద్ జాఫర్ ఐదేళ్ల కిందట ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వలస వెళ్లాడు. కొన్నాళ్లకు అతడి సోదరుడు మహమ్మద్ రహీబ్‌ను కూడా తీసుకెళ్లాడు. ఇటీవల పశ్చిమాసియాలో యుద్ధం వేళ ఇరాన్ (ఎతీజీని) పౌరులకు సాయం చేయాలని జాఫర్‌ను అతడి తల్లి కోరారు. దీంతో భారత్‌లోని ఇరాన్ దౌత్యకార్యాలయ బ్యాంకు ఖాతాకు అతడు 200 రియాల్స్ నగదును విరాళంగా ఇచ్చాడు. అయితే, ఆ డబ్బును తన సోదరుడు రహీబ్ ఫోన్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేశాడు. విషయం తెలుసుకున్న సౌదీ అరేబియా భద్రతా సిబ్బంది మార్చి 27న రహీబ్‌ను అరెస్టు చేసి విచారణ జరిపారు. మూడు రోజుల తర్వాత జాఫర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు ఎక్కడున్నారో తెలియరాలేదు. దీంతో భారత్‌లోని వీరి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తూ కేంద్రాన్ని సాయం కోరారు. తమ కుమారులను విడిపించాలని విదేశాంగ శాఖను అభ్యర్థించారు. ఈ ఘటనపై రియాద్‌లోని భారత ఎంబసీ అధికారులు స్పందించారు. భద్రతా సంబంధిత వ్యవహారాల్లో జాఫర్, రహీబ్‌లను సౌదీ పోలీసులు అరెస్ట్ చేశారని, దీనిపై ఆ దేశ విదేశాంగ శాఖను సంప్రదిస్తున్నట్లు తెలిపారు.

ముడి చమురు ధరలే కీలకం

ఆర్‌బీఐ, ప్రభుత్వ చర్యలతో రికవరీకి అవకాశం

జనంసాక్షి:పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో నెలకొన్న ప్రతికూల సెంటిమెంటు కారణంగా, ఈ వారంలో స్టాక్‌మార్కెట్ గమనంపై విశ్లేషకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (ఆర్‌బీఐ) ప్రభుత్వం ప్రకటించిన చర్యలు రూపాయి విలువ పతనాన్ని అరికట్టగలవని భావిస్తున్నందున మార్కెట్‌లో రికవరీ వస్తుందని కొంత మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే విదేశీ పెట్టుబడిదారులు కొనుగోలుదార్లుగా మారాలంటే ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు ఆర్థిక వృద్ధి కూడా మెరుగుపడాలని అంటున్నారు. నిఫ్టీ-50 సూచీకి 24,000 పాయింట్ల వద్ద నిరోధం, 23,150 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.6 శాతానికి తగ్గించడం, రిటెయిల్ ద్రవ్యోల్బణ అంచనాలను 5.1 శాతానికి పెంచడం ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని వాస్తవికంగా అంచనా వేసినట్లు ఒక విశ్లేషకుడు తెలిపారు. ద్రవ్యోల్బణం పెరిగితే ఈ ఏడాది చివర్లో కీలక రేట్ల పెంపు ఉండొచ్చని అంచనా వేశారు. ముడి చమురు ధరలు, రూపాయి మారకపు విలువ, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు ఒక పరిమిత శ్రేణికి లోబడి కదలాడవచ్చు. సమీప భవిష్యత్తులో ఈ రంగంలో సానుకూల వార్తలేవీ లేకపోవడం ఇందుకు కారణం. రుతుపవనాల ప్రారంభంతో గిరాకీ మందగించే అవకాశం ఉన్నందున, సమీప భవిష్యత్తులో లోహ కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురయ్యే అవకాశం ఉంది. ఔషధ కంపెనీల షేర్లలో ఎలాంటి సానుకూల వార్తలూ లేనందున, ఒక శ్రేణిలోనే కదలాడవచ్చు. ధర తగ్గినప్పుడల్లా ట్రేడర్లు కొనుగోలు చేయొచ్చు. సిమెంటు కంపెనీల షేర్లు ఈ వారమూ నష్టపోవడానికే అవకాశాలున్నాయి. పెట్రోలియం కోక్ ధరల పెరుగుదల కంపెనీలకు ప్రధాన ప్రతికూలతగా ఉండొచ్చు. సిమెంటుకు గిరాకీ కూడా తగ్గొచ్చు. నిఫ్టీ వాహన సూచీ ప్రస్తుతం రోజువారీ చార్టుల్లో స్పష్టమైన దిశను సూచించడం లేదు. అయితే 25,900 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు, 26,500-26,800 పాయింట్ల మధ్య నిరోధం ఎదురుకావొచ్చు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ముడి చమురు, గ్యాస్ కంపెనీల షేర్లపై ప్రభావం చూపొచ్చు. అప్‌స్ట్రీమ్ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరంలో బలమైన ఆదాయాలు నమోదు చేయొచ్చని అంచనా. డౌన్‌స్ట్రీమ్ కంపెనీలు బేరిష్ ధోరణిలో కదలాడొచ్చు. నిఫ్టీ బ్యాంక్ సూచీ పరిమిత శ్రేణిలోనే చలించొచ్చు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ

పెట్టుబడిదార్లకు ప్రభుత్వం కల్పిస్తున్న పన్నుల ఉపశమనం సానుకూల అంశాలుగా ఉన్నాయి. టారిఫ్‌లు పెంచే అవకాశం ఉన్నందున టెలికాం షేర్లకు సానుకూల అంచనాలనే విశ్లేషకులు వెలువరిస్తున్నారు. ఈ రంగ సూచీకి తక్షణ మద్దతు 3,505 వద్ద, నిరోధం 3,750 వద్ద కనిపిస్తోంది. అధిక ముడి చమురు ధరల వల్ల మార్జిన్లు తగ్గొచ్చనే కారణంగా, యంత్రపరికరాల కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. దీర్ఘకాలంలో ఈ రంగంలోని షేర్లు బలమైన ఆదాయాలు నమోదు చేయొచ్చనే అంచనాలున్నాయి. అయితే అమెరికా-ఇరాన్ యుద్ధం, అధిక వాల్యుయేషన్లు ప్రతికూల అంశాలుగా కనిపిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో ఐటీ కంపెనీల షేర్లలో అస్థిరత కొనసాగే అవకాశం ఉంది. అయితే ర్యాలీలు, దిద్దుబాట్ల మధ్య వాటి ధరలు ప్రస్తుత స్థాయిల వద్దే కొనసాగే అవకాశం ఉంది.

ఓటీపీ కొట్టేలోపే యూరియా మాయం!

బుకింగ్ కోసం గంటల తరబడి రైతుల నిరీక్షణ

- సర్వర్ సమస్యలతో స్టాక్ దొరకక అవస్థలు
- 20 కి.మీ దూరం వెళ్లినా చేతులెత్తేసిన రైతులు
- సమీప సొసైటీల్లోనే ఎరువులు అందించాలని డిమాండ్

సిరికొండ, జూన్ 8 (జనంసాక్షి): ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే యూరియా ఎరువుల కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. బుకింగ్ కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడుతున్నా, ఓటీపీ నమోదు చేసి లాగిన్ అయ్యేలోపే స్టాక్ ఖాళీ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నా ఆశించిన మేర సరఫరా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నామని చెబుతున్నప్పటికీ, ఆ సమయంలో రైతులు బుకింగ్ ప్రక్రియ పూర్తి చేసేలోపే "స్టాక్ అయిపోయింది" అనే సందేశం కనిపిస్తోందని వాపోతున్నారు. దీంతో తెల్లవారుజాము నుంచే కేంద్రాల వద్ద వేచి ఉన్న రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాలు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. గంటల తరబడి నిరీక్షించిన తర్వాత కూడా బుకింగ్ పూర్తి కాకపోవడం, తీరా తమ వంతు వచ్చే సరికి స్టాక్ అందుబాటులో లేకపోవడం రైతుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది.

ఇంతకుముందు గ్రామాలకు సమీపంలోని సహకార సంఘాలు, సొసైటీల్లోనే యూరియా లభించేదని, ప్రస్తుతం 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో సమయం వృథా కావడమే కాకుండా రవాణా ఖర్చులు కూడా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక యూరియా బస్తా కోసం అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. రైతుకు సమీపంలో ఉన్న సహకార సంఘం లేదా సొసైటీని యూనిట్‌గా తీసుకుని యూరియా పంపిణీ చేపడితే సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయని రైతులు సూచిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వర్ లోపాలను సరిచేసి, తగిన యూరియా నిల్వలు అందుబాటులో ఉంచి రైతులకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితుల్లో "పంటకు యూరియా చల్లే కంటే రైతుల కళ్లలోనే యూరియా చల్లినట్లుంది" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులు ప్రొఫెషనల్స్ గోపాలో చేరి

సేవా కార్యక్రమాలు చేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

హయత్ నగర్, జూన్ 8 (జనం సాక్షి) : గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) స్థాపనకు 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ప్రచురించిన "గోపా స్వర్ణధార" ప్రత్యేక సంచికను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తన మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ సమాజంలో ఐక్యత, చైతన్యం, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో గోపా సంస్థ ఏర్పాటై ఐదు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి కోసం గోపా చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు.

గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని విడుదల చేసిన "గోపా స్వర్ణధార" సంచిక సంస్థ చరిత్ర, సేవా కార్యక్రమాలు, సమాజాభివృద్ధికి చేసిన కృషిని ప్రతిబింబిస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రొఫెషనల్స్, వ్యాపారవేత్తలు, మేధావులు గోపాలో సభ్యులుగా చేరి సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంకా గోపాలో భాగస్వాములు కాని వారు సభ్యత్వం తీసుకొని సంస్థ మరింత పటిష్టంగా ఎదగడానికి సహకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షులు మోతె చక్రవర్తి గౌడ్, గోపా ప్రధాన కార్యదర్శి జి.వి. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్, ఉపాధ్యక్షులు చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, డాక్టర్ గోపగాని ఆనంద్ గౌడ్, కారింగు భిక్షమయ్య గౌడ్, చీకూరి సత్యం గౌడ్, డాక్టర్ ఆర్. విద్యానంద గౌడ్, పి. శ్రీనివాస్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులు, మరిపల్లి కళ్యాణ్ చక్రవర్తి గౌడ్, గూడెపురి సాయి వేణు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్

బొంరాస్ పేట,(జనం సాక్షి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమమని రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్,సింగిల్ విండో చైర్మన్ జయకృష్ణ అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీరేశలింగం అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి

తెలంగాణ రైతు సంఘం

కరీంనగర్ టౌన్, జూన్ 8 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చి, అనంతరం రూ.12 వేలకు పరిమితం చేసినప్పటికీ పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయడం లేదన్నారు.రబీ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు ఇప్పటికీ అనేక మంది రైతుల ఖాతాల్లో జమ కాలేదని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఈ సమయంలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ప్రణాళిక లోపభూయిష్టంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, డీఏపీ సహా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తగినంతగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ, విత్తన, విద్యుత్ సంస్కరణల చట్టాలు రైతులకు నష్టదాయకమని ఆరోపించారు. అన్ని పంటలకు చట్టబద్ధమైన మద్దతు ధర కల్పించాలని, రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి కౌలు భరోసా కల్పించాలని, భూభారతి సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ సాదా బైనామాలను అమలు చేయాలని, ధరణి పోర్టల్‌ను రైతులకు అనుకూలంగా మార్చాలని కోరారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి రైతులను చైతన్యపరుస్తూ ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, కోశాధికారి బాసిర సంపత్‌రావు, సహాయ కార్యదర్శులు చెల్పూరి రాములు, శీలం అశోక్, జనూతుల జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గుండేటి వాసుదేవ్, కమిటీ సభ్యులు స్వప్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభ విజయవంతం

వర్షాకాల సన్నద్ధత, తాగునీరు, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, ఓటర్ల జాబితా సవరణపై అవగాహన

శంషాబాద్,జూన్8(జనంసాక్షి) : శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామ పంచాయతీలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య మెరుగుదల, తాగునీటి సదుపాయాల కల్పన, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలమాకుల గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామ సభలో సర్పంచ్ కటుకూరి కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, 'జల సంరక్షణ వన సంరక్షణ', వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరదల నిర్వహణ, భద్రత తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఎంపీఓ రమేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. వర్షాకాల సన్నద్ధత, పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వన మహోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమర్ లింగం గౌడ్, ఉప సర్పంచ్ గూడెపు కుమార్, వార్డు సభ్యులు, శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దండు ఇస్తరీ, నాయకులు చంద్రారెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి

హయత్ నగర్, జూన్ 8 (జనం సాక్షి) ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోల్, బండ్లగూడ ప్రాంతాలకు చెందిన ఐకాన్ వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నాగోల్, బండ్లగూడ ప్రాంతాలకు చెందిన ఐకాన్ వాకర్స్ గ్రూప్ సభ్యులు ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ అవగాహన లక్ష్యాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. "ప్రకృతిని ప్రేమిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో ఐకాన్ వాకర్స్ గ్రూప్ సభ్యులు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పిస్తూ, మొక్కలు నాటడం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయము అని అన్నారు. ఆరోగ్య పరిరక్షణకు నడక ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం, పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకాన్ వాకర్స్ గ్రూప్ అధ్యక్షులు చెరుకు ప్రశాంత్ గౌడ్, జనరల్ సెక్రెటరీ రమేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రమేష్, జాయింట్ సెక్రెటరీ పెంటారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, సలహాదారులు ప్రతాప్ రెడ్డి, తూర్పాటి చిరంజీవి, చెరుకు చిరంజీవి, ఈశ్వర్ గౌడ్ సభ్యులు సీతారాములు, పర్యావరణ ప్రేమికులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- బహిరంగ క్షమాపణ చెప్పాలని మేస్త్రీల సంఘం డిమాండ్
- ఘట్కేసర్‌లో నిర్మాణ కార్మికుల భారీ నిరసన ర్యాలీ
- చర్యలు లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్న హెచ్చరిక
- నేటి నుంచి సెంట్రింగ్, తాపీ పనుల బంద్‌కు పిలుపు

ఘట్కేసర్/అల్వాల్, జూన్ 8 (జనంసాక్షి): భవన నిర్మాణ కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మేస్త్రీల సంఘం డిమాండ్ చేసింది. తమను దూషించిన సెంట్రింగ్ కార్మిక సంఘాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో జరిగిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. నిర్మాణ రంగంలో చెమటోడ్చి పనిచేసే కార్మికులను దళారీలు, మోసగాళ్లు అంటూ కొందరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆవేదనకు గురిచేశాయని కార్మిక నాయకులు పేర్కొన్నారు. కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు.

ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప కాలనీ భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం అధ్యక్షుడు తిరుమలయ్య మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికులు రాత్రింబవళ్లు కష్టపడి సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని, అలాంటి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. కార్మికుల గౌరవాన్ని కించపరిచే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ నిరసన కేవలం స్థానిక సమస్య కాదని, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద జరుగుతున్న మహాధర్నాకు సంఘీభావంగా నిర్వహిస్తున్న ఉద్యమంలో భాగమని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే నిర్మాణ పనులన్నింటినీ నిలిపివేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కీల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దూరి శ్రీను, కోశాధికారి ఈ. ఉపేందర్, ప్రచార కార్యదర్శి ఎం. శేఖర్, సలహాదారులు ఎస్.కె. అలీభాయ్, సైదులు, డి.వి. కృష్ణతో పాటు భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, అల్వాల్ పరిధిలో సోమవారం నుంచి సెంట్రింగ్, తాపీ మేస్త్రీ పనులను స్వచ్ఛందంగా బంద్ చేయాలని అల్వాల్ బిల్డర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో నిర్మాణ రంగానికి చెందిన వారంతా బంద్‌ను విజయవంతం చేయాలని కోరింది. సంఘం నిర్ణయాన్ని ఉల్లంఘించి ఎవరైనా పనులు నిర్వహిస్తే కఠిన జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, గోపి యాదవ్, ఎల్లారెడ్డి, పాండు, మాల్యాద్రి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారావు, అంకం రావు, సంతోష్‌రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు బంద్‌కు మద్దతు తెలిపారు.

సీఎం ఆరోపణలు నిరాధారం

తెలంగాణకు కేంద్రం వేల కోట్ల నిధులు ఇచ్చింది : వై. శ్రీధర్

రాజేంద్రనగర్, జూన్8(జనంసాక్షి) : ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు బీజేపీ గోల్కొండ, గోషామహల్ ఇన్‌చార్జ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ ఘాటుగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని గుర్తించకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని ఆయన విమర్శించారు.. గత 45 రోజుల్లోనే గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు, అమృత్ 2.0 పథకానికి రూ.3,849 కోట్లు, జాతీయ రహదారుల విస్తరణకు వేల కోట్ల రూపాయలు, పీఎం ఈ-డ్రైవ్ బస్సుల కోసం రూ.3 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు నిధులు రాకుండా అడ్డుకుంటు న్నారనే సీఎం వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని వై. శ్రీధర్ అన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తున్నప్పటికీ, వాటిని ప్రజల కు వివరించకుండా బీజేపీ నాయకులపై ఆరోపణలు చేయడం సరి అయినది కాదని, తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ శ్రేణులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని వై. శ్రీధర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

ధరల మోత తగ్గించకుంటే ఉద్యమిస్తాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై గద్దర్ అభిమానుల సంఘం ఆగ్రహం

అల్వాల్, జూన్ 8(జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వం నిరంతరం పెంచుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, గద్దర్ అభిమానుల సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సి.యల్.యాదగిరి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రోజురోజుకూ ధరలు పెంచుకుంటూ పోతుండటంతో సామాన్యుల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే పేదలు.. పెరిగిన ధరల వల్ల కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

గతంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా తగ్గినప్పుడు ఆ లబ్ధిని ప్రజలకు బదిలీ చేయని కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ ఇంధన ధరలను మరింత పెంచడం దుర్మార్గమని ఆరోపించారు. ఒకవైపు ధరల భారం మోపుతూ, మరోవైపు ప్రజలను పొదుపు చేయాలని ప్రధాని సలహాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ తదితర పార్టీలు కేవలం మోదీ భజనకే పరిమితమయ్యాయని, ఓట్లేసి గెలిపించిన ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసరాల ధరలు సామాన్యుడిపై రోకలిపోటులా మారాయని.. తక్షణమే ధరలను తగ్గించకపోతే అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని యాదగిరి హెచ్చరించారు.

చిట్టీల వ్యాపారం నిర్వహించిన హెడ్‌మాస్టర్ సస్పెన్షన్

- ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ చిట్టీల వ్యాపారం..
- రూ.20 లక్షల చిట్టీ వివాదంపై విచారణ అనంతరం చర్యలు
- ఆర్డీవో నివేదికతో సస్పెన్షన్ ఉత్తర్వులు

నల్లగొండ,జూన్ 8 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం శర్భాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహి స్తున్న బెక్కం వీరయ్యపై జిల్లా యంత్రాంగం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపిన అధికారులు ఆరోపణలు నిజమని నిర్ధారించడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

ముష్టిపల్లి గ్రామానికి చెందిన బెక్కం వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు నిర్వహించిన రూ.20 లక్షల చిట్టీలో సభ్యుడిగా ఉండి చెల్లింపుల విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో మూడు విడతలుగా ఫిర్యాదులు సమర్పించారు. ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విచారణ కోసం చండూరు ఆర్డీవోను ఎంక్వయిరీ అధికారిగా నియమించారు. ఆర్డీవో నిర్వహించిన సమగ్ర విచారణలో ప్రధానోపాధ్యాయుడు ప్రభుత్వ సేవలో కొనసాగుతూనే ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహించినట్లు నిర్ధారణ అయినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దీంతో జిల్లా విద్యాధికారి (డీఈఓ) మే 11న షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరారు. అయితే ప్రధానోపాధ్యాయుడు సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో జూన్ 6న సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై నాంపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ) స్పందిస్తూ, ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో విచారణ జరిపారని, విచారణలో ఆరోపణలు రుజువుకావడంతో ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ సేవా నియమాలను ఉల్లంఘిస్తూ ప్రైవేటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్టాలు, సేవా నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని వారు కోరుతున్నారు. ఈ ఘటన ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు సేవా నియమాలను ఉల్లంఘించిన పక్షంలో అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారనే విషయం మరోసారి స్పష్టమైంది.

పారదర్శకంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి

- మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- మూలమడ గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే

నవాబ్ పేట్ జూన్ 08(జనం సాక్షి) : బాధిత కుటుంబాల పట్ల సమగ్ర విచారణ చేసి చట్టపరమైన న్యాయం చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.నవాబుపేట మండలం మూలమాడ గ్రామంలో ఈ నేల 2న జరిగిన ఇరువర్గాల ఘర్షణ సంఘటనపై గాయపడిన వాటర్ మ్యాన్ కిష్టయ్యను కుటుంబాన్ని,మాజీ సర్పంచ్ సుభాన్ రెడ్డిని సోమవారం మాజీమంత్రి సబితా ఎమ్మెల్యే ఇంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్,మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభ్రప్‌థ్ పటేల్ లతో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కవిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి,బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు సూచించారు. వికారాబాద్ డీఎస్పీ అంజయ్యతో ఫోన్ చేసి మాట్లాడారు. దాడి చేసిన ఆయుధాలను ఎందుకు సేకరించలేదని, ముందుగా మహిళలపై దాడి చేస్తే దాని కోసం పోలీస్ స్టేషన్ నందు పిర్యా దు చేసిన కూడా ఎందుకు యాక్షన్ తీసుకోలేదని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, నిజాలు వెలికితీసి న్యాయం జరిగేలా పోలీసులు సమగ్ర విచారణ నిర్వహించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆమె పేర్కొన్నారు.బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులకు సూచించారు.బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగేందర్ గౌడ్, దేశమొళ్ల ఆంజనేయులు,బీఆర్ఎస్ నవాబ్ పేట్ మండల నాయకులు భరత్ రెడ్డి, దయాకర్ రెడ్డి, విజయ్ కుమార్, శాంతి కుమార్,పురుషోత్తం చారి, మహేశ్వర్ రెడ్డి,నరేందర్ రెడ్డి, మాణిక్య రెడ్డి, మల్లేశం, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలకు
సరిపడా ఎరువుల నిల్వలు

- అందుబాటులో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా
- రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు
- యాప్ ద్వారా ప్రణాళికాబద్దంగా, పారదర్శకంగా యూరియా పంపిణీ
- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 08: జనం సాక్షి : జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాల కంటే నిజామాబాద్ జిల్లాలోనే అత్యధిక స్థాయిలో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని అన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకమైన పంపిణీ కోసం యూరియా బుకింగ్ యాప్ దోహదపడుతోందని అన్నారు. ఈ యాప్ పనితీరును గమనించిన ఇతర రాష్ట్రాలు కూడా ఒక్క యూరియానే కాకుండా మిగతా అన్ని ఎరువులను కూడా బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆయా మండలాల్లో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉంది అనే సమచారం తెలుసుకునే వెసులుబాటు ఉందని, రైతులు సమీప డీలర్ల వద్ద పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా ప్రతీ సొసైటీ వద్ద, ప్రతీ డీలర్ షాప్‌లో ఎరువుల నిల్వల వివరాలను తెలియజేసేలా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాలకు ఆస్కారం లేకుండా మండల స్పెషల్ ఆఫీసర్లతో పాటు తహసిల్దార్లు, ఇతర అధికారులతో నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసి అట్టిపెట్టుకోకుండా, తమ అవసరాలకు అనుగుణంగా దశల వారీగా ఎరువులు తీసుకోవాలని, మోతాదుకు మించి వాడవద్దని హితవు పలికారు. ఎరువుల దుకాణాలు, వివిధ సంస్థల ద్వారా యూరియా, ఇతర ఎరువులు కొనే రైతులకు వారి అంగీకారం లేకుండా వేరే ఏ రకమైన ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. యూరియా ఎరువులతో ముడిపెడుతూ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతులను బలవంతం చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 08 (జనం సాక్షి) : ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి,ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా,ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించు కుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుంద ని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం.... వార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు

చైర్మన్ ప్రశాంత్ కుమార్, కమిషనర్ మల్లికార్జున స్వామి

జమ్మికుంట, జూన్ 8 (జనం సాక్షి): జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి తెలిపారు.సోమవారం 5, 7, 17, 18, 22, 25, 27, 30వ వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో వారు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అలాగే జల్ సంచయ్ - జల్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వార్డుల్లో డ్రైన్ల పూడికతీత, శుభ్రపరిచే పనులు, రుతుపవనాల సన్నద్ధత, తాగునీటి సరఫరా నిర్వహణ, నీటి నిల్వల నివారణ, పారిశుధ్య చర్యలు, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అభివృద్ధి, పారిశుధ్య పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాస్కర్, శ్రీనివాస్, ఐ. రమేష్‌ల తో పాటు కౌన్సిలర్లు యాట్ల సునీత అశోక్, ఫిరోజ్, బత్తుల లక్ష్మణ్, కుతాడి తిరుపతి, శీలం శ్రీనివాస్, చందా రాజు, వార్డు అధికారులు, పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

లోన్ యాప్ వేధింపులకు బలైన వివాహిత

- అప్పు తీర్చాలంటూ భర్త, కుటుంబం మీద అనుమానాలు
- కూతురి మృతిపై తండ్రి తీవ్ర ఆరోపణలు
- పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు

మల్కాజ్‌గిరి, జూన్ 8 (జనంసాక్షి): ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులు మరో నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. అప్పు తీర్చాలంటూ నిర్వాహకులు తీవ్రంగా వేధించడంతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మృతురాలు కృష్ణా జిల్లా గణపవరం గ్రామానికి చెందిన శివదానపు దేవనందిని (25). పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల ప్రాంతానికి చెందిన తిరుమల రేవంత్ కుమార్‌తో 2022 నవంబర్ 8న ప్రేమ వివాహం చేసుకుని నగరానికి వలస వచ్చి నేరేడ్‌మెట్ జె.జె. నగర్‌లోని ఎస్ఎస్‌బీ క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం భర్త రేవంత్ కుమార్ పని మీద బయటకు వెళ్లాడు. ఆ తర్వాత భార్యకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానించి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. బెడ్‌రూమ్‌లో దేవనందిని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది.

దిగ్భ్రాంతికి గురైన రేవంత్ వెంటనే నేరేడ్‌మెట్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా, ఆమె ఓ లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నట్లు గుర్తించారు. గడువు ముగిసినా డబ్బులు చెల్లించక పోవడంతో లోన్ యాప్ నిర్వాహకులు పదేపదే ఫోన్ చేసి తీవ్రంగా వేధించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వేధింపులు తట్టుకోలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే దేవనందిని మృతిపై ఆమె తండ్రి భీమవరపు వెంకటరెడ్డి తన కుమార్తె మరణం వెనుక అల్లుడు రేవంత్ కుమార్, అత్త, మామ, మరిది పాత్రపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇల్లు వదిలి వెళ్లిన తర్వాత దేవనందిని పుట్టింటి వారితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోలేదని బంధువులు చెబుతున్నారు. కేవలం లోన్ యాప్ వేధింపుల వల్లే చనిపోయే అవకాశం లేదని, కుటుంబ విభేదాలు లేదా మరేదైనా కుట్ర దాగి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, లోన్ యాప్ వేధింపులతో పాటు కుటుంబ సభ్యులు వ్యక్తం చేసిన అనుమానాలపై కూడా అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుల భద్రతకు ఐఎంఏ యాక్షన్ కమిటీ

రాష్ట్ర ఐఎంఏ ఆదేశాలతో కరీంనగర్‌లో కార్యాచరణ ప్రారంభం

- పోలీస్ శాఖతో సమన్వయం బలోపేతానికి వినతిపత్రం
- ఆసుపత్రుల్లో హింసాత్మక ఘటనల నివారణే లక్ష్యం
- వైద్యులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఐఎంఏ

కరీంనగర్ బ్యూరో, జూన్ 08 (జనంసాక్షి) : వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, రోగులు, ఆసుపత్రి ప్రాంగణాల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కరీంనగర్ యాక్షన్ కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డా. పి. కిషన్ మార్గదర్శకత్వం లో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు ఐఎంఏ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎంఏ కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు డా. ఆకుల శైలజ, కార్యదర్శి డా. ఎన్. మహేష్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కలిసి వినతిపత్రం సమర్పించింది. వైద్య వర్గాలు, పోలీస్ శాఖ మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కోరింది. సమావేశానికి ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి. కిషన్ నాయకత్వం వహించగా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డా. బి.ఎన్. రావు, తానా రాష్ట్ర అధ్యక్షుడు డా. కె. అరుణ్, తానా కరీంనగర్ అధ్యక్షుడు డా. ఎ. నరేష్, ఐఎంఏ కరీంనగర్ కోశాధికారి డా. వి. నీలిమ పాల్గొన్నారు. ప్రతిపాదిత యాక్షన్ కమిటీ ఐఎంఏ క్రియాశీల సభ్యులతో ఏర్పాటవుతుందని, ఆసుపత్రుల్లో హింసాత్మక ఘటనలు, శాంతిభద్రతల సమస్యలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు పోలీస్ అధికారులతో సమన్వయం చేస్తూ పనిచేస్తుందని తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యాలు, పోలీస్ శాఖ మధ్య సమాచార మార్పిడిని మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మెడికో-లీగల్ అంశాలు, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం పోలీస్ శాఖతో క్రమానుగత సమన్వయ సమావేశాలు నిర్వహించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని ఐఎంఏ కోరింది. దేశవ్యాప్తంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై జరుగుతున్న హింసాత్మక ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఆరోగ్య సేవల భద్రత కోసం పోలీస్ శాఖతో సమన్వయం అత్యవసరమని నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ఐఎంఏ తెలంగాణ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డా. బి.ఎన్. రావుపై జరిగిన దాడిని ఐఎంఏ కరీంనగర్ తీవ్రంగా ఖండించింది. వైద్యులపై హింసాత్మక చర్యలు సమాజానికి ఏమాత్రం ఆమోదయోగ్యం కావని, ఇలాంటి ఘటనలు వైద్య వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంది. దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని వైద్యులకు తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వం, పోలీస్ శాఖను కోరింది. వైద్యుల రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్న ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి. కిషన్‌కు ఐఎంఏ కరీంనగర్ జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది. ప్రైవేట్ ఫోర్స్‌లు లేదా ప్రైవేట్ భద్రతా బలగాల ఏర్పాటును తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని, అన్ని సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో, పోలీస్ శాఖ సహకారంతో, శాంతియుత పద్ధతుల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రతినిధులు, వైద్యుల బృందం పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సిఎల్‌లో బాయిలర్ సేఫ్టీపై అవగాహన

గోదావరిఖని, జనంసాక్షి : తెలంగాణ ప్రభుత్వం 99-రోజుల చర్యా ప్రణాళిక కింద ఆర్ఎఫ్‌సిఎల్ ప్లాంట్‌లో బాయిలర్ సేఫ్టీ అవగాహనా ప్రోగ్రాం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ 99-రోజుల చర్యా ప్రణాళిక ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికల భాగంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బాయిలర్స్ శాఖ పరిశ్రమలో సురక్షిత బాయిలర్ ఆపరేషన్లను ప్రేరేపించడానికి, సేఫ్టీ అవగాహనను పెంపొందించడానికి బాయిలర్ సేఫ్టీ అవగాహనా ప్రోగ్రాం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వం డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉ. భీమ రావు పాల్గొన్నారు. సోమర పు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే, రామగుండం, ప్రేమ్ కు మార్, ఆర్‌సిఎల్ జిఎం(ఓఅండ్ఎం) కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశానికి ప్రసంగిస్తూ, ముఖ్య అతిథి బాయిలర్ సేఫ్టీ నియమావళులను కఠినంగా పాటించడం, ప్రతిరోధక రక్షణ, పీరియాడిక్ ఇన్స్పెక్షన్లు మరియు పరిశ్రమ ప్రమాదాలను మానివరిచే బాయిలర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను ప్రత్యేకంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నిబంధనలకు అనుగుణమైన అవసరాలు, సురక్షిత ఆపరేటింగ్ విధానాలపై సాంకేతిక సెషన్లు కూడా నిర్వహించబడ్డాయి

ఆచార్య కల్వకుంట రామకృష్ణకు
'సాహిత్య బంధు' పురస్కారం

కరీంనగర్ టౌన్, జూన్ 8 (జనం సాక్షి) : స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణకు ప్రతిష్ఠాత్మక 'సాహిత్య బంధు' పురస్కారం లభించింది. చైతన్య సారస్వత పరిషత్తు, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీలలో రాజమండ్రిలో నిర్వహించిన ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో ఈ పురస్కారాన్ని ప్రకటించారు.గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, మాజీ ఎమ్మెల్సీ కెవివి సత్యనారాయణ రాజు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం చేతుల మీదుగా ఆచార్య కల్వకుంట రామకృష్ణ ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

ఆచార్య రామకృష్ణ రచించిన కవితా సంపుటాలు హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించబడగా, తెలుగులోనూ ఆయన రచనలు పాఠకాదరణ పొందుతున్నాయి. తెలుగు సాహిత్యాన్ని జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని సాహితీ వర్గాలు పేర్కొన్నాయి.ఈ సందర్భంగా కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆచార్య రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ నితిన్ పాఠక్, టి. రాజయ్య, తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హర్‌జోత్ కౌర్, డాక్టర్ రాపర్తి శ్రీనివాస్, కట్టా వేణు తదితర అధ్యాపక, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలి

డిఆర్డివో పిడి సాయన్న



ఎడపల్లి, జూన్ 8 (జనంసాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలని అందుకు గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిఆర్డిఓ పిడి సాయన్న స్పష్టం చేశారు. సోమవారం ఎడపల్లి మండలంలోని వడ్డేపల్లి, కుర్నాపల్లి, తానాకలాన్, బాపూనగర్ గ్రామాలలో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. ఈ మేరకు కుర్నాపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో డిఆర్డిఓ పిడి సాయన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని గ్రామస్థాయి అధికారులు సమిష్టిగా కృషిచేసి గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ మేరకు గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారంకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో పిడి సాయన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిత, ఉప సర్పంచ్ స్వామి, ఎంపీడీవో శంకర్, సంజయ్, శేఖర్ రెడ్డి, గంగాధర్, పరిగె సుమన్, వైద్యురాలు శైలజ, ఎఎస్ఐ షకీల్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై కాంగ్రెస్ గళం

- కరీంనగర్‌లో ఖాళీ సిలిండర్లతో వినూత్న నిరసన
- కట్టెల పొయ్యిపై వంట చేస్తూ కేంద్రంపై విమర్శలు
- ప్రజలపై ధరల భారం మోపుతోందన్న కాంగ్రెస్ నేతలు
- గ్యాస్ ధరలు తగ్గించాలని కలెక్టర్‌కు వినతిపత్రం

కరీంనగర్ బ్యూరో, జూన్ 08 (జనంసాక్షి) : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎల్‌పీజీ గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఇందిరా చౌక్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్లు, బీజేపీ వ్యతిరేక ప్లకార్డులతో రోడ్డుపై కట్టెల పొయ్యి ఏర్పాటు చేసి వంట చేస్తూ కాంగ్రెస్ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధరల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు. ఎన్నికల అనంతరం ధరల పెంపు తప్పదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుగానే హెచ్చరించారని, ప్రస్తుతం అదే జరుగుతోందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలను ఒక్కసారిగా పెంచడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు మరింత పెరిగాయని, ఇంధన ధరల ప్రభావం నిత్యావసర వస్తువులపై కూడా పడుతోందని అన్నారు. ఒకవైపు దేశాభివృద్ధి పేరుతో ప్రచారం చేసుకుంటూనే మరోవైపు సామాన్య ప్రజలపై భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ధరలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు పెరుగుతున్న ధరలపై స్పందించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ప్రజలపై భారం పెరుగుతున్నా మౌనం పాటించడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు ప్రజల తరఫున కేంద్రాన్ని ప్రశ్నించాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. 2014లో రూ.400 ప్రాంతంలో ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం మూడు రెట్లు పెరిగిందని, సబ్సిడీ వ్యవస్థను బలహీనపరచడం వల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గ్యాస్ నింపించుకునే స్థోమత లేక పలుచోట్ల మహిళలు మళ్లీ కట్టెల పొయ్యిలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉప్పుల అంజనీ ప్రసాద్, మల్లికార్జున రాజేందర్, పులి ఆంజనేయులు గౌడ్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకుల నరసయ్య, మడుపు మోహన్, అజయ్ గౌడ్‌తో పాటు బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం: రేకుల షెడ్డు కూలి బీహార్ కార్మికుడు మృతి

బోయినపల్లి, జూన్ 08 (జనం సాక్షి) : బోయిన్ పల్లి మండల పరిధిలోనీ వెంకట్రావు పల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులు ఒకరి ప్రాణాన్ని బలిగొన్నాయి. స్థానిక ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీచాయి. ఈ గాలుల ధాటికి వెంకట్రావుపల్లి గ్రామంలోని ఓ పంక్చర్ షాపు పైకప్పు (రేకుల షెడ్డు) పూర్తిగా గాల్లోకి లేచి, రోడ్డుకు అవతలి వైపునకు ఎగిరిపడింది. ఆ సమయంలో షాపులోనే ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మహ్మద్ షంషాద్ (30) రేకులతో పాటు రోడ్డుపై ఎగిరిపడి, అక్కడే ఉన్న డివైడర్ ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం షంషాద్ మృతి చెందాడు. మృతుడి బావమరిది సద్దాం హుస్సేన్ అన్సారీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

మహిళల భద్రతకు సమాజమే కవచం

- మైనర్ బాలికల రక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం
- సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అప్రమత్తత పెంచాలి
- పిల్లల మొబైల్ వినియోగంపై తల్లిదండ్రులు నిఘా అవసరం
- ప్రమాదకర భవనాలను గుర్తించి ప్రజలను హెచ్చరించాలి

గోదావరిఖని, జూన్ 8 (జనంసాక్షి): మహిళల భద్రత, మైనర్ బాలికల రక్షణ, సైబర్ నేరాల నివారణలో సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతగా ముందుకు రావాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాదీ పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎన్‌టీపీసీ కాకతీయ హాల్‌లో ఎన్‌టీపీసీ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డీసీపీతో పాటు మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ మేయర్, గోదావరిఖని ఏసీపీ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో తక్కువ సమయంలోనే భారీ వర్షాలు కురుస్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, బలహీన నిర్మాణాలు ప్రజలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, కాలనీ నాయకులు తమ పరిధిలోని ప్రమాదకర భవనాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం పెరగడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలు ఆందోళనకరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలను నిశితంగా గమనించడంతో పాటు వారి మొబైల్ ఫోన్ వినియోగంపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు. మత్తు పదార్థాల బారినపడిన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి పోలీసు శాఖతో పాటు డీ-అడిక్షన్ కేంద్రాల సహకారం తీసుకోవాలని తెలిపారు.డీసీపీ బి. రామ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రతే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. మైనర్ బాలికలు మోసపూరిత సంబంధాల ప్రభావంతో ఇళ్లను విడిచి వెళ్లిపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలను అరికట్టేందుకు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలను వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించినప్పుడే మహిళలపై జరిగే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని డీసీపీ పేర్కొన్నారు. సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం కీలకమని, మహిళలు, బాలికలు భయరహిత వాతావరణంలో జీవించే పరిస్థితులను కల్పించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలుద్దీన్, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, లచ్చన్న, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
9 జూన్ 2026

నల్లగొండలో విషాదం

తండ్రీకుమారుడు మృతదేహాలుగా లభ్యం

నల్లగొండ ప్రతినిధి,జూన్ 8,(జనం సాక్షి): నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులోని సూర్యవంశీ కాలనీలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో తండ్రి, కుమారుడు రక్తపు మడుగులో మృతదేహాలుగా కనిపించడంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులు విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న పబ్బత్తి రెడ్డి లింగరెడ్డి మరియు ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి (9వ తరగతి విద్యార్థి)గా గుర్తించారు. ఘటన సమయంలో లింగరెడ్డి భార్య, పెద్ద కుమారుడు ఇంట్లో లేరు. వారు తిరిగి ఇంటికి వచ్చి చూడగా లింగరెడ్డి, ప్రణీత్ రెడ్డి విగతజీవులుగా కనిపించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రణీత్ తలపై తీవ్ర గాయాలు ఉన్నట్లు గుర్తించగా, లింగరెడ్డి పురుగుల మందు సేవించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. గతంలో లింగరెడ్డి కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఘటనాస్థలిలో ఒక సుత్తె లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఇది హత్యా? ఆత్మహత్యా? లేక ఇతర కారణాల వల్ల జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, లింగరెడ్డి మరియు ఆయన కుమారుడి మృతిపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ ఘటనతో సూర్యవంశీ కాలనీతో పాటు నల్లగొండ పట్టణం మొత్తం విషాదంలో మునిగిపోయింది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేస్తున్నాయి.

తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం

- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జూన్8 (జనంసాక్షి) : ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూర య్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించ దం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున ఫైనాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. (రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్శ్ను ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబా లకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేర య్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజక వర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుం డా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదం డ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందు చూపుతో ఈ నిర్ణయం తీసుకుం దన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యో గులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రంలో పాఠశాలలను కుదించే కుట్ర

- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కవిత



హైదరాబాద్, జూన్8 (జనంసాక్షి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సమీకృత పాఠశాలలు నిర్ణయంపై టిఆర్ఎస్ చీఫ్ కె.కవిత మండిపడ్డారు. రాష్ట్రంలోని 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు సిఎం ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా సిఎం కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఇప్పుడు పాఠశాలలు మూసివేస్తున్నామని ప్రకటించారని, విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అన్నారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డొమెస్టిక్ సర్వెంట్స్ వివరాలు సేకరించాలి

- డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, జూన్ 08 (జనంసాక్షి) : డొమెస్టిక్ సర్వెంట్స్ వివరాలు సేకరించాలని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ డీజీపీ కార్యాలయంలో స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనరేట్ల పరిధులు, పోలీస్ స్టేషన్ల లిమిట్లు, సరిహద్దు గ్రామాల విభజన, జ్యూరిస్డిక్షన్ సంబంధిత అంశాలపై సంబంధిత కమిషనర్లతో విస్తృతంగా చర్చించారు. సర్కిళ్లు, జోన్లు, గ్రామాల పునర్విభజన వంటి అంశాలు అన్ని శాఖలకు అనుకూలంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వ్యక్తులు గృహ సేవకులుగా పనిచేస్తూ కొన్ని నేరాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా డొమెస్టిక్ సర్వెంట్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలని డీజీపీ ఆదేశించారు. వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఎక్కడ పనిచేస్తున్నారు అనే సమాచారాన్ని డేటాబేస్ రూపంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, సీఐడీ వ్యవస్థ బలోపేతం, మాన్యువల్ ప్రక్రియల ఆధునీకరణ, భవిష్యత్ కార్యాచరణలపై కూడా చర్చించారు. నవంబర్ నెలలో పోలీస్ ట్రిట్ నిర్వహణతో పాటు అక్టోబర్‌లో మహిళా పోలీస్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. మహిళా పోలీసులకు 33 శాతం రిజర్వేషన్ సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, లా అండ్ ఆర్డర్, ఫీల్డ్ డ్యూటీలలో మరింత అవకాశాలు కల్పించాలని సూచించారు. పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ ద్వారా కోర్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, టీజీ కాప్స్ వ్యవస్థ వినియోగంపై అధికారులు చర్చించారు. ముఖ్యంగా డయల్-100, రౌడీ షీటర్లు, వాహనాల సెర్చింగ్, హిస్టరీ షీటర్ల డేటా వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. అలాగే ఏఐ ఆధారిత పోలీసింగ్, డ్రోన్స్, హెచ్ఆర్ఎంఎస్, డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ -యూజింగ్ టెక్నాలజీ" అనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, వెహికల్ ఆడిట్, సిబ్బంది వినియోగం, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై కూడా చర్చించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ బ్యూరోతో పాటు ఫుడ్ అడల్టరేషన్ కంట్రోల్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా చర్చించారు. ఈ సమావేశంలో డీజీపీ తో పాటు గా హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్,ఇంటెలిజెన్స్ డిజి విజయ్ కుమార్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్, టి జి టెక్నికల్ సర్వీసెస్ డి జి వి వి శ్రీనివాస రావు, హైదరాబాద్ కమిషనర్ సజ్జనర్, ఆక్టోపస్ డీజీ అనిల్ కుమార్, హోమ్ గార్డ్స్ డీజీ స్వాతి లక్రా, మల్టి జోన్ -× చంద్రశేఖర్ రెడ్డి, రోడ్ సేఫ్టీ ఐ జి రమేష్ నాయుడు, ఐ జి పి అండ్ ఎల్ గజరావు భూపాల్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ కమిషనర్ ఎం రమేష్ రెడ్డి, మల్కాజ్గిరి కమిషనర్ సుమతి తో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి

- జోగులాంబ గద్వాల జిల్లాను తాకినట్లు వెల్లడి

హైదరాబాద్, జూన్8 (జనంసాక్షి) : తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. తాజాగా వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. రుతుపవనాలు జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా తెలంగాణలోకి అధికారికంగా ప్రవేశించాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వాతావరణం చల్లబడటమే కాకుండా, రాబోయే రెండు మూడు రోజుల్లో ఇవి మరింత బలోపేతం కానున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ అంతటా రుతుపవనాలు పూర్తిగా విస్తరిస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతుపవనాల రాకతో ముఖ్యంగా దక్షిణ , తూర్పు తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన జారీ చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు, అలాగే సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ రుతుపవనాల ప్రవేశం ఎంతో ఉపశమనాన్ని , సంతోషాన్ని కలిగిస్తోంది.

టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

- రాజ్యసభ ఎంపి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా

కోల్‌కతా, జూన్8 (జనంసాక్షి) : టీఎంసీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దిల్లీలో నేడు జరగనున్న ఇండియా కూటమి కీలక భేటీలో పాల్గొనడానికి మమత దేశ రాజధానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

పెన్షన్ డబ్బు కోసం వ్యక్తి దారుణ హత్య

- భార్యకు జీవిత ఖైదు... కొండుకు, కుమార్తెకు మరణశిక్ష
- మల్కాజిగిరి కోర్టు తీర్పు

హైదరాబాద్, జూన్8 (జనంసాక్షి) : పింఛను డబ్బు కోసం వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మృతుడి భార్యకు జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు మరణ శిక్ష విధిస్తూ మాల్కాజిగిరి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2019 ఆగస్టులో విశ్రాంత రైల్వే ఉద్యోగి కిషన్ సుతార్(70)ను పింఛను డబ్బు కోసం అతని భార్య, కుమారుడు, కుమార్తె కలిసి హత్య చేసి ముక్కలుగా నరికారు. అనంతరం ఆ శరీర భాగాలను ఆరు బకెట్లలో నిల్వచేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మృతుడి భార్య గంగాబాయికి జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు ఉరి శిక్షను విధిస్తూ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు తీర్పు ఇచ్చారు.

ఆంధ్రా పేపర్ మిల్స్‌తో గోదావరి కాలుష్యం

- షోకాజ్ నోటీసులు జారీ చేయండి
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం

అమరావతి, జూన్8 (జనంసాక్షి) : గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ రోజు సేకరించిన నమూలను ప్రయోగశాలల్లో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో పవన్ సమీక్షించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

తృణమూల్ నేత జంగీర్ ఖాన్ అరెస్ట్

- దేశ సరిహద్దులు దాటుతుండగా పట్టివేత
- ఖాన్‌పై పలు కేసులు నమోదు

కోల్‌కతా, జూన్8 (జనంసాక్షి) : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలవరం సృష్టించిన తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత జహంగీర్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. గత కొన్ని రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సోమవారం తెల్లవారు జామున వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుంది. దేశం దాటి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా నేపాల్ సరిహద్దు ప్రాంతంలో నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఎస్టీఎఫ్ అధికారులు ఆయన ఆట కట్టించారు. జహంగీర్ ఖాన్‌పై బెంగా ల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా ఫాల్తా పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 క్రిమినల్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, భూఆక్రమణలు, మహిళలను వేధించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తనపై నమోదైన వరుస కేసుల్లో పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని జహంగీర్ ఖాన్ గతంలో కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మే 18న కోర్టు ఆయనకు తాత్కాలిక ఉపశమనం కల్పించినప్పటికీ, తాజాగా ఆ రక్షణను న్యాయస్థానం ఉపసంహరించుకుంది. కేవలం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయనో, లేదా దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే పిటిషనర్ వాదనల ఆధారంగా క్రిమినల్ కేసుల్లో రక్షణను పొడిగించలేమని న్యాయ మూర్తులు స్పష్టం చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తన క్లయింట్‌పై కావాలనే వరుస కేసులు పెట్టారని, ఇదంతా రాజకీయ పగతో జరుగుతున్న వేధింపులని జహంగీర్ ఖాన్ తరఫు సీనియర్ న్యాయవాది కిషోర్ దత్తా కోర్టులో వాదించారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ ఈ వాదనను గట్టిగా వ్యతిరేకించారు.

పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ

- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల సహకారం
- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

హైదరాబాద్, జూన్8 (జనంసాక్షి) : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ పక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్ లు పెట్రోలింగ్ ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) శ్రీ తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈనెల 25.06.2026 నుండి ప్రారంభం అవుతుందని, కావున బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, తిరిగి వాటిని సేకరించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ ఐ ఆర్ పక్రియలో పాల్గొనే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్ల పేర్లను, ఫోన్ నెంబర్లను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సమన్వయం చేసుకోవడానికి పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లను కూడా ఎన్నికల అధికారులు సేకరించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే పక్రియ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈఓలను ఆదేశించారు. ఈసందర్భంగా హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) శ్రీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొనే అన్ని బీఎల్ఓలు, ఇతర అధికారులకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు / డీఈఓలు, ఆయా జిల్లాల పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ సీఈఓ (ఎఫ్ఏసీ), నోడల్ అధికారులు, పీఎం-ఐటీ, ఇతర సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370